


ESTD: 1999 www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 03-02-2026 మంగళవారం | సంపుటి : 14 | సంచిక : 57 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal Follow us on

# నేరం చేసి నీతులా?

## తప్పులు చేసి విచారణ వద్దంటే ఎలా?



- తెలంగాణ జాతిపితకే నోటీసులా అనడం విడ్డూరంగా ఉంది
- ఉద్యమకారుల ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి బెడ్ రూంల నుంచి వారిని ఈడ్చుకెళ్లిన సందర్భాలున్నాయి
- అటువంటి వారు జాతిపితలు ఎలా అవుతారు
- ఫోన్ ట్యాపింగ్‌పై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కెసిఆర్‌కు ఉంది
- రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రధానోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** అధికారంలో ఉన్నాం కదా అని నేరాలు చేస్తాం.. విచారించొద్దంటే ప్రజాస్వామ్యంలో నడవదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా విచారణ ఎదుర్కొవాల్సిందేనన్నారు. ఆ తప్పు నిరూపణ అయితే శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందన్న సీఎం.. అప్పటి ముఖ్యమంత్రిగా ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్ మీద ఉందన్నారు. ఈ కేసులో ఆయనను విచారించడానికి సిట్ అధికారులు నోటీసులు ఇస్తే.. తెలంగాణ జాతిపితకే నోటీసులు ఇస్తారా? అని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లు తెలంగాణ ప్రజలను విస్మరించన వాళ్లు, ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేసిన వారు జాతిపితలు ఎలా అవుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ జాతిపిత అయితే దేనికి ఆదర్శం అని అడిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇబ్బంది పడని ఉద్యమకారుడు లేడన్నారు. ఎంతో మంది ఉద్యమకారులను అరెస్టులు చేసి వేధించారని ఆరోపించారు. ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి.. బెడ్ రూమ్‌ల నుంచి ఈడ్చుకెళ్లిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు అవేమీ కనిపించడం లేదని చెప్పారు. సోమవారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి మెమోరియల్ ఆడిటోరియంలో ప్రతిష్టాత్మక 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు–ప్రదానోత్సవ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. పదవులు, రూ. వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న మీరు ఉద్యమకారులు ఎలా అవుతారని సీఎం ప్రశ్నించారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని చెప్పారు.

మిగతా 2లో

## రాహుల్ వ్యాఖ్యలతో

# రాజుకున్న సభ

- 2017 భారత - చైనా ఘర్షణలపై కాంగ్రెస్ నేత
- ప్రస్తావనకు అభ్యంతరం తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- మాజీ సైన్యాధ్యక్షుడి అప్రచురిత గ్రంథం ఆధారంగా చేసిన రాహుల్ వ్యాఖ్యలు తగవు : రాజ్‌నాథ్
- వాగ్వివాదం పెరగడంతో జోక్యం చేసుకున్న స్పీకర్
- రాహుల్‌కు మద్దతుగా నిలిచిన అఖిలేశ్ యాదవ్ : సభ వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (వుదయం బ్యూరో) :** 2017లో చైనాతో గల సరిహద్దుల్లో జరిగిన ఘర్షణపై మాజీ సైన్యాధ్యక్షుడు మనోజ్ ముకుంద్ నరవాణే రాసినట్లు చెబుతున్న జ్ఞాపకాల గ్రంథం నుంచి చైనా సేనలు భారత భూభాగాన్ని ఆక్రమించుకోడానికి వస్తున్నట్టు గల భాగాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించడంతో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనితో సోమవారం నాడు లోక్ సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. రాష్ట్రపతి ఉపన్యాసానికి కృజ్ఞతలు చెప్పే తీర్మానానికి సమాధానమిస్తూ రాహుల్ గాంధీ ప్రసంగించారు. నరవాణే జ్ఞాపకాలపై ఆధా రంగా రాసిన వ్యాసాన్ని ఉటంకిస్తూ రాహుల్ గాంధీ తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

మిగతా 2లో

## తెలంగాణకే తాడిచర్ల 1 గనులు



- రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- 2015 లోనే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయింపు

2



# జరగనిదానికి ఇంత రాద్ధాంతమా?

## ఫోన్ ట్యాపింగే జరగలేదని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు

## కావాలనే ఆ కేసును సాగదీస్తున్నారు : కెటిఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చేపడుతోన్న సిట్ అధికారులు అసలు ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందోననే విషయం మాత్రం చెప్పడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆ కేసును ధారావాహిక సీరియల్ మాదిరి నడిపిస్తున్నారని విమర్శించారు. అసలు ఫోన్ ట్యాపింగే జరగలేదని ఈ నెల ఒకటో తేదిన సిట్ విచారణలో కేసీఆర్ చెప్పారన్నారు. వాస్తవానికి సిట్ విచారణకు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదన్నారు. చట్టం అంటే కేసీఆర్‌కు గౌరవం ఉంది కాబట్టే విచారణకు హాజరు అయ్యారన్నారు. హరీశ్‌రావుకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందన్న ఆయన ఫోన్ ట్యాపింగ్ ఘట్టాన్నిఇంతటితో ముగించాలన్నారు. సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కేసీఆర్‌ను విచారణను నిరసిస్తూ 7 వేల గ్రామాల్లో సీఎం దిష్టి బొమ్మలు తగలబెట్టారని చెప్పారు. దీంతో ఆనాటి ఉద్యమ స్ఫూర్తి గుర్తొచ్చిందని చెప్పారు. మమ్మల్ని తట్టి లేపిన రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నందినగర్ లో కేసీఆర్ విచారణ నేపథ్యంలో మా ఇంటి చుట్టు వెయ్యి మంది పోలీసులను పెట్టారనీ.. దాంతో పాటు పోలీసులు శాంతిభద్రతలపైనా దృష్టి పెడితే బావుంటుందన్నారు. సుల్తాన్ బజార్‌లో పట్టపగలే ఏటీఎం దగ్గర చోరి జరిగిందని విమర్శించారు. నల్లమల సాగర్‌తో తెలంగాణకు నీళ్ల దోపిడి జరుగుతుందని కేటీఆర్ ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్ రెడ్డి.. సాయంత్రానికి ఢిల్లీ వెళ్లారని మండిపడ్డారు. ఢిల్లీకి తాకిన సింగరేణి కుంభకోణం గురించి వాస్తవాలను బయట పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ ఎవరికి ఇచ్చారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సృజన్ రెడ్డి కాల్ డాటా బయట పెడితే అన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు ఖమ్మంలో రౌడిలను వేసుకొని తిరుగుతున్నాడని ఆరోపించారు. అతనిపై కేసు పెట్టిన సీఐ హాబీబుల్లా ఖాన్‌ను అందుకే బదిలీ చేశారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏ జిల్లా నాయకత్వం అక్కడ పనిచేస్తుందన్నారు. మేము ఎవరిని బ్లాక్ మెయిల్ చేశామో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలన్నారు. బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డేనన్నారు.

### పోలీసులకు అత్యుత్సాహం మంచిది కాదు

ఫోన్ ట్యాపింగ్ కేసు సిట్ చీఫ్ సజ్జనార్ జడ్జి కాదని ఆయన కేవలం పోలీసు అధికారి మాత్రమేనని కేటీఆర్ మండిపడ్డారు. సజ్జనార్ అయినా ఇంకో అధికారి అయిన ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అనుకుంటే కోర్టుకు వెళ్లాలి కదా అని ప్రశ్నించారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు అంటూ సజ్జనార్ చేసిన ట్వీట్ పై స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు. ట్వీట్, లీక్‌లతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. అత్యుత్సాహం ప్రదర్శించడం అధికారులకు మంచిది కాదని హెచ్చరించారు.

# కెసిఆర్‌ను విచారించొద్దా?



- అది ఎలా నేరమవుతుంది
- విచారణలో ఏమి జరిగిందో కెసిఆర్ చెప్పాలి
- పారదర్శకంగా విచారణ జరగాలి
- నాతో పాటు నా భర్త ఫోన్‌లు ట్యాప్ చేశారు
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో మాజీ సీఎం కేసీఆర్ విచారణ ఎదుర్కొవాల్సిన దుస్థితి అసలు ఎందు కు వచ్చిందో గ్రహించాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ఇటీవల సిట్ విచారణ ఎదుర్కొన్న కేసీఆర్.. అందులో ఏం జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలం గాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ కేసు విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలవటమే నేరమని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ సీఎం ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆమె... అందుకే ఆయన్ను విచారణకు పిలిచారని చెప్పారు. విచారణకు ఎవరినీ పిలిచినా సరే వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. చట్టాలకు ఎవరు అతీతం కాదని తేల్చి చెప్పారు. తాను తప్పు చేయకపోయినా ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొన్నానని చెప్పారు.

### పిలిస్తే సిట్ విచారణకు వెళ్తా

తనతో పాటు తన భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయిని ఆరోపించారు. ఒకవేళ సిట్ అధికారులు విచారణకు పిలిస్తే కూడా వెళ్తానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పారదర్శకంగా విచారణ జరగాలన్నారు.

మిగతా 2లో

## బిజెపి కోసం పనిచేస్తున్న ఇసి

- 'సర్' ద్వారా భారీఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారు
- సిఇసి జ్ఞానేష్ కుమార్ తో సుదీర్ఘ సమావేశం తరువాత
- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ



2

**కోల్‌కత, ఫిబ్రవరి 2 (ఎ.ఎం.ఎస్) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌తో గంటన్నర పాటు సమావేశమైన అనం తరం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్రదాడికి దిగారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కింద భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని, ఎన్నికల సంఘం బీజేపీ ఆదేశాల మేరకు పని చేస్తోందని ఆరోపించారు.



2

## సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

- రెండేళ్లలోనే మార్పుచూపించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం
- రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
- అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా ప్రజల్లోకి చేర్చండి
- ఆధునీకరించిన ఐఅండ్ పిఆర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సందర్భంగా
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

## ఎన్నికల తరువాత ఇంటి పన్ను పెంచుతారు

కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్



2

## కెసిఆర్‌పై విషం చిమ్ముతున్న రేవంత్

సీఎం పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

2



## ఆయిల్‌పామ్‌కు అండ కరువు

- పసుపు బోర్డుకు నిధుల్లేవు
- మాటల్లోనే రైతు సంక్షేమం
- కేంద్రం మాటలు చేతల్లో లేవు
- మంత్రి తుమ్మల



**ఖమ్మం, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులపై అదనపు భారాన్ని మోపేలా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. కేంద్రం ప్రసంగాల్లో రైతు సంక్షేమం గురించి చెబుతున్నా.. బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం అది ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి కాంగ్రెస్ సర్కార్... కృషి చేస్తుంటే కేంద్రం మాత్రం అందుకు అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రైతులకు, రాష్ట్ర వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందని ఆయ న విమర్శించారు. సోమ వారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలని తాము పదేపదే విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. దీంతో దేశీయ రైతులకు గిట్టుబాటు ధర లభించడం కష్టతరమవుతోందన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన జాతీయ పసుపు బోర్డుకు బడ్జెట్‌లో నామ మాత్రపు నిధులు కూడా కేటాయించకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం బోర్డు ఏర్పాటు పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆచరణలో రైతులకు మేలు చేసే నిధులు కరువయ్యాయని అన్నారు.

మిగతా 2లో

# ముందు మా ఫోన్‌లే ట్యాప్ చేశారు

- ఆ అవసరం ఏమొచ్చింది?
- హైదరాబాద్ కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించారు
- ఈ విషయం బావ బామ్మరుదులకు తెలియదా? :
- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఎ.ఎం.ఎస్) :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదట బీజేపీ నేతల ఫోన్లనే ట్యాప్ చేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. సంఘ విద్రోహ శక్తులు ఫోన్లను ట్యాప్ చేసినట్లు బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు.. అసలు మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సీరియస్ అయ్యారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడా రు. మా ఫోన్లు ట్యాప్ చేసి.. ఉల్టా మాపైనే కేసులు పెట్టా రని మండిపడ్డారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎవరు తప్పు చేసినా జైలుకు పంపుతామని గతంలో కేసీఆర్ అన్నారు.. ఆ మాటలు కేసీఆర్‌కూ వర్తిస్తాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై జాలి చూపొద్దని.. దోషులను తప్పకుండా జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించే మూర్ఖులంతా అంధులేనని ఎంపీ రఘునందన్ విమర్శించారు.

మిగతా 2లో

## రెబెల్ గా పోటీ చేస్తే పార్టీ నుంచి సస్పెండ్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హెచ్చరిక
- మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు సహకరించాల్సిందే
- కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల

2

## ఆయిల్‌పామ్‌కు అండ కరువు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కొబ్బరి సాగు గణనీయంగా పెరుగుతున్నా, రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటుపై కేంద్రం ఎలాంటి ప్రకటనా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన కేంద్రం, ఎరువులపై సబ్సిడీలు తగ్గించడం ద్వారా ధరలు పెరిగేలా చేస్తోందని మంత్రి విమర్శించారు. ఎరువుల ధరల పెంపుతో సాగు ఖర్చులు భారమై, రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్మలా బడ్జెట్ తెలంగాణ రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని, కేంద్రం తన వైఖరిని మార్చుకుని రాష్ట్రానికి రావాల్సిన వాటాను, నిధులను వెంటనే కేటాయించాలని తుమ్మల డిమాండ్ చేశారు.

## ముందు మా ఫోన్‌లే ట్యాప్ చేశారు

మొదటి పేజీ తరువాయి

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని ఒక్కొకరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకే కుటుంబం నుంచి ఒక్కొక్కరు ఒక తీరుగా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. బడ్జెట్‌పై ఒక దిక్కు కేటీఆర్.. ఇంకో దిక్కు హరీశ్‌రావు, కవిత మాట్లాడుతున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ భారతదేశానికి ఏడు హైస్పీడ్ రైళ్లు కేటాయిస్తే అందులో హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ విషయం.. బావబామ్మర్దులకు కనిపించడం లేదా?, అని ప్రశ్నించారు. గత బడ్జెట్ కంటే రైల్వే రంగానికి ఈసారి 15 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించామన్నారు ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని చెబుతున్నరాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఓసారి బడ్జెట్‌ను పరిశీలించాలని సూచించారు. గతంలో కంటే ఈసారి రూ.1300 కోట్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కేటాయించారని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## కెసిఆర్‌ను విచారించొద్దా?

మొదటి పేజీ తరువాయి

ఇంకా సాగదీయకుండా విచారణను తుది దశకు తేవాలని డిమాండ్ చేశారు. గుంట నక్కలతో కలిసి అధికార కాంగ్రెస్ డ్రామాలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఈ కేసులో విచారణ పూర్తి చేస్తారని నమ్మకం తనకు లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే కొన్ని రోజులు ఈ కేసును అటు, ఇటు తిప్పుతున్నారని చెప్పారు. నిజంగా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రెండేళ్లుగా ఎందుకు కేసు ముందుకు పడటం లేదని ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు సైకిల్‌కు స్టాండ్ వేసి తొక్కినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి చెడ్డోడైనా సరే... కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని కేటీఆర్ కోరుతున్నారని కవిత ఆరోపించారు. ఇలాంటి రాచరిక, నియంతృత్వ పోకడలను మార్చుకోకుంటే బీఆర్‌ఎస్‌ను ఎవరు కాపాడలేరని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ రాజరిక పోకడలు అనుసరిస్తుంటే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పట్టించుకోవటం లేదన్నారు. ఇవ్వగలిగే పరిస్థితిలో ఉండి కూడా బీజేపీ తెలంగాణకు రూపాయి ఇవ్వడం లేదని ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పొలిటికల్ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. యువత, మహిళలు, మేధావులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లి అక్కడ మల్టీనేషన్ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ బూటకమన్నారు. అక్కడ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి... పెట్టుబడులు తీసుకువచ్చామనడం కట్టుకథలేనని కవిత విమర్శించారు. రూ. వేల కోట్ల ఎంవోయూలు చేసుకున్న కంపెనీలకు కనీసం వెబ్ సైట్ దిక్కులేదని కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిపై తాను చేసిన రీసెర్చ్ లో చాలా కంపెనీల గుట్టు బయటపడిందన్నారు. హ్యాష్ ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూల పేరుతో తెలంగాణ యువత ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాలు, నేరాలు పెరిగితే సీఎం ఏం చేస్తున్నట్లు? అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని సీఎం రేవంత్ రెడ్డి 30 సార్లు ఢిల్లీకి వెళ్లి మోడీని కలిసినా రూ. 30 వేల కోట్లు తేలేదని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి అభ్యర్థికి ఓటు వేయాలని కవిత పిలుపునిచ్చారు. జాగృతి తరపున ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున పోటీ చేస్తున్నామని ఈ నెల 20 తర్వాత జనంబాట కార్యక్రమం కొనసాగిస్తామన్నారు.

## కెసిఆర్‌పై విషం చిమ్ముతున్న రేవంత్

### సీఎం పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కనీస సంస్కారంతో పాటు చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ కూడా జాతిపితే అన్నారు. సోమవారం రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే.. అదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారన్నారు. కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని అన్నారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? అని నిలదీశారు. ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు, ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. లక్కీ లాటరీలో సీఎం అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి? అని విమర్శించారు. నువ్వు హార్వర్డ్ వెళ్ళినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టం అవుతోందని హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.

### భావ ప్రకటనపై హైకోర్టు తీర్పును

## ధ్రువీకరించిన సుప్రీం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** సోషల్ మీడియా పోస్టులపై కేసులు నమోదు చేసే విషయంలో తెలంగాణ సర్కార్‌కు అత్యున్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. భావ ప్రకటన స్వేచ్ఛను నొక్కి చెబు తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమావరం కొట్టివేసింది. హైకోర్టు మార్గదర్శకాల్లో తప్పేమీ లేదని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ (నల్ల బాలు) సీఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీనిపై శశిధర్ గౌడ్ గతంలో హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు పోలీసు యంత్రాంగానికి పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయకూడదని చెప్పింది. ప్రతి చిన్న పోస్టుపై ఇష్టం వచ్చినట్లుగా కేసులు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలని అక్షింతలు వేసింది.



**సుప్రీంకోర్టులో పిటిషన్..** హైకోర్టు ఇచ్చిన ఈ మార్గదర్శకాలు తమకు ఇబ్బందికరంగా ఉన్నాయని, వీటిని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ సర్కారు ఇటీవలే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. ఈ మార్గదర్శకాలు పోలీసుల విధులకు ఆటంకంగా మారుతాయని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం హైకోర్టు తీర్పును తాము అభినందిస్తున్నామని పేర్కొంది. ఇలాంటి మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీ లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రభుత్వ పిటిషన్‌ను సోమావారం డిస్మిస్ చేస్తూ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది.

# రాహుల్ వ్యాఖ్యలతో రాజుకున్న సభ

మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీ తన ఉపన్యాసంలో డోక్లాంను ప్రస్తావిస్తూ, భారత భూభాగంలోకి నాలుగు చైనా ట్యాంకులు ప్రవేశిస్తున్నాయి. వారు డోక్లామ్‌లో ఒక శిఖరాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. ట్యాంకులు కైలాష్ శ్రేణికి కొన్ని వందల మీటర్ల దూరంలోనే ఉన్నాయని, ఆర్మీ చీఫ్ రాశారని ప్రతిపక్ష నాయకుడు పేర్కొనడంతో, పార్లమెంటులోనూ, సోషల్ మీడియా వేదికలపైనా పెద్ద చర్చ రాజుకుంది. సోషల్ మీడియాలో ఒక వర్గం కాంగ్రెస్ నాయకుడు గల్వాంను ప్రస్తావిస్తున్నారా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.
భారత్, చైనా, భూటాన్‌ల కూడలి అయిన డోక్లాం, 2017లో భారతదేశం, చైనా మధ్య ప్రతిష్టంభనకు వేదికగా నిలిచింది. అనంతరం 2020లో, తూర్పు లడాక్‌లోని గల్వాం, ఇరు పక్షాల మధ్య ఘోరమైన ఘర్షణకు స్థానమై, పరిస్థితి గంభీరం కావడంతో 20మంది భారతీయ సైనికులు మరణించారు.
పార్లమెంటులో రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు స్పందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అతడు ప్రచురితం కాని పుస్తకం నుంచి ఉటంకించకూడదని, సభలో దానిని ప్రామాణీకరించమంటూ మధ్యలో జోక్యం చేసుకున్నారు.
దీనిపై మాట్లాడేందుకు అతడిని అనుమతించకూడదు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు తాను ఉటంకిస్తున్న పుస్తకాన్ని సభ ముందుంచాలని కోరుతున్నాను, ఎందుకంటే ఆయన ప్రస్తావిస్తున్న పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని సింగ్ అన్నారు. హోం మంత్రి అమిత్ షా కూడా మధ్యలో జోక్యం చేసుకుని, ఆ పుస్తకం ప్రచురితమైందా లేదా అని తెలుసుకోగోరారు. ఒకవేళ ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాకపోతే, ఈ సమాచారం అంతా మీకెలా తెలుసని ఆయన ప్రశ్నించారు.

> లడాఖ ప్రతిష్ఠంభనపై మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ మనోజ్‌నరవాణె అప్రచురిత జ్ఞాపకాల ఆధారంగా రాసిన ఒక వ్యాసాన్ని రాహుల్ గాంధీ ఉటంకించడంతో లోక్‌సభలో తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. అప్రచురిత పుస్తకాల నుంచి ఉటంకించడం నియమాలకు విరుద్ధమంటూ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా అభ్యంతరం తెలిపారు. కాగా, రాహుల్ తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం గందరగోళానికి దారి తీసింది.

రాహుల్ గాంధీకి మద్దతుగా నిలుస్తూ, ఈ విషయం అత్యంత సున్నితమైనదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. లోహియా, నేతాజీ, జార్జ్ ఫెర్నాండెస్ సహా అందరూ చైనా గురించి హెచ్చరించారని, చైనాకు సంబంధించిన విషయం అత్యంత సున్నితమైందని అన్నారు. కనుక, ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అనుమతించాలని ఆయన అన్నారు. తీవ్ర వాగ్వాదం జరుగుతున్న సమయంలో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ ఆదేశాన్ని పాటించాలని రాహుల్‌ని కోరారు. సభలో గందరగోళం కొనసాగడంతో, ప్రతిపక్ష నాయకుడు కేవలం రాష్ట్రపతి ఉపన్యాసం గురించి మాట్లాడాలే తప్ప, ప్రచురితం కాని పుస్తకం నుంచి ఉటంకించకూడదని స్పీకర్ ఓం బిర్లా రూలింగ్ ఇచ్చారు. సమావేశంలో జరుగుతున్న చర్చకు సహేతుకం కాని విషయాలను పుస్తకం లేదా దినపత్రిక నుంచి ఉటంకించకూడదని, నియమాలను బిర్లా చదివి వినిపించారు. ప్రతిపక్ష నాయకుడిగా మీరు సభలో ఆరోపణలు చేస్తున్నారు, నియమాలను పాటించడం లేదు. ఇది సరైనది కాదు అని ఆయన అన్నారు. ఇందుకు, నేనేం మాట్లాడాలో దయచేసి మీరే చెప్పండి స్పీకర్ సర్ అంటూ రాహుల్ స్పందించారు. అందుకు ఓం బిర్లా, నేను మీకు సలహాదారును కాను, కానీ నియమాల ప్రకారం సభ జరిగేలా చూడటం స్పీకర్‌గా నా విధి, చర్చ కూడా లిస్ట్ అయిన విషయాంవానికే పరిమితం అంటూ సమాధానమిచ్చారు.
పదవిని అవమానించవద్దని, దాని తీర్పుకు వ్యతిరేకంగా వెళ్లవద్దని స్పీకర్ రాహుల్ గాంధీతో అన్నారు. సభాధ్యక్షుడు చేసిన నిర్ణయాలను అవమానించే హక్కు మీకు లేదు, మాట్లాడకూడదని మీరు నిర్ణయించుకుంటే, అది సరే అని బిర్లా అన్నారు. అనంతరం, తదుపరి వక్త అఖిలేష్ యాదవ్ అని, ఆయన రాష్ట్రపతి ఉపన్యాసంపై మాట్లాడతారని స్పకర్ ప్రకటించారు. గందరగోళం నడుమ స్పీకర్ మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు.
బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తన ప్రసంగంలో యావత్ ప్రతిపక్షాన్ని, కాంగ్రెస్ పార్టీని 'దేశద్రోహులు' అని ముద్ర వేశారని, అందుకే తాను సభలో వాస్తవాలను స్పష్టం చేయాలనుకున్నానని తన రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ అన్నారు. రక్షణమంత్రి, హోం మంత్రి, ప్రధానమంత్రి మా పార్టీ గురించి, మా నాయకుల గురించీ, మా జాతీయవాదం గురించి ప్రశ్నలు లేవనెత్తుతారు. ఈ వ్యాసం ప్రధానమంత్రి వ్యక్తిత్వాన్ని గురించి రాసింది, ఇది చైనా గురించి లేదా ప్రధాని గురించి కాదు అని ప్రతిపక్ష నాయకుడు అన్నారు.
ప్రతిపక్షాల వ్యక్తిత్వాన్ని గురించి లేదా వారి దేశభక్తి గురించి తేజస్వీ సూర్యం తన ఉపన్యాసంలో ఎటువంటి ప్రశ్నలు లేవనెత్తలేదంటూ షా ప్రతిస్పందించారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమైన అనంతరం, రాహుల్ గాంధీ గల్వాం లోయ గురించి ప్రస్తావించారు. కాగా, రాష్ట్రపతి ఉపన్యాసానికి పరిమితం కమ్మని స్పీకర్ అన్నారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమంటూ రాహుల్ గాంధీ సమాధానమిచ్చారు. స్పీకర్ సభను 4 గంటల వరకూ వాయిదా వేశారు.

## నేరం చేసి నీతులా?

మొదటి పేజీ తరువాయి




మరి ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని నిలదీశారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఆయన్ను అరెస్టు చేసింది మీ పాలనలో కాదా.. అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని దుయ్యబట్టారు. పోలీసులు మిమ్మల్ని అలా తలుపులు బద్దలు కొట్టి తీసుకు రాలేదనే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కేవలం నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారన్నారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని సీఎం చెప్పారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారనీ.. మరోవైపు శిబు సోరెన్ లాంటి వాళ్లు విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ దైవాంశ సంభూతుడేం కాదన్నారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారన్న సీఎం... ఇప్పుడా మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని చురకలంటిచారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలన్న ఆయన హుందాగా వ్యవహరిస్తే కొంతైనా మీ గౌరవం నిలబడేదని కేసీఆర్ ను ఉద్దేశించి చెప్పారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం ? ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం ? ఇదెక్కడి జాతిపిత లక్షణం? అన్నారు. కేసీఆర్ చేసిన తప్పులకే సిట్ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. అయితే తాను ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదన్న రేవంత్ రెడ్డి... అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే అన్నారు. వచ్చిన తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబ సభ్యులే పంచుకున్నారని సీఎం విమర్శించారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుందన్నారు. ఆ ప్రజా తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని రావి నారాయణరెడ్డి చాటిచెప్పారని సీఎం వ్యాఖ్యానించారు. దేశంలో అధిక మెజారిటీతో గెలిచిన ఎంపీగా రావి నారాయణ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన అన్ని పదవులను త్యాగం చేసిన గొప్ప నాయకుడన్నారు. కానీ ఈ రోజుల్లో ప్రజలు ఓడించినా పదవులు వదులుకునేందుకు ఇష్టపడటంలేదని కేసీఆర్ ను ఉద్దేశించి చెప్పారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాసేలా ఎస్ ఐ ఆర్ ను తీసుకువచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ కేంద్ర కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్న సీఎం.. దీనిపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

## తెలంగాణకే తాడిచర్ల 1 గనులు

### రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల-1 బొగ్గు గనుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేసింది. తాడిచర్ల-1 బొగ్గు గనులను 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు వెల్లడించింది. తాడిచర్ల-1 బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించి.. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సోమవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు.. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. 2019 మార్చి నెలలో బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించి నియమించిన ఉన్నత స్థాయి కమిటీ ఒక రిపోర్ట్ ఇచ్చినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఈ రిపోర్టుకు ఆమోదం తెలిపిన తర్వాత..2020 జూన్ నెల నుంచి దేశంలో బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ పూర్తిగా మారిపోయినట్లు వెల్లడించారు. వ్యాపార అవసరాలకు వినియోగించే గనులు అన్నింటినీ కేవలం వేలం ద్వారానే కేటాయించాలని ఉన్నత స్థాయి కమిటీ సూచనలు చేసినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. కొన్ని ప్రత్యేక, తప్పని పరిస్థితుల్లో మాత్రమే.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నేరుగా.. బొగ్గు గనుల కేటాయింపు చేయాలని ఆ ఉన్నత స్థాయి కమిటీ స్పష్టంగా తేల్చి చెప్పినట్లు వివరించారు. అదే సమయంలో తాడిచర్ల-2 బొగ్గు గనులను ఇప్పటివరకు ఎవరికీ కేటాయింపు చేయలేదని ఆ లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు. మరోవైపు.. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేవని ఆరోపించారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని పేర్కొన్నారు.మరో వైపు.. 2020 జూన్ నెల నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వ రంగ సంస్థలకు బొగ్గు గనులను కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై తెలిపారు. ఈ గనుల వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యతను ఇవ్వకుండా.. కేవలం ప్రైవేటు రంగ కొనుగోలుదారులకే కట్టబెడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు వెల్లడించారు.

## ఎన్నికల తరువాత ఇంటి పన్ను పెంచుతారు

### కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే ఇంటిపన్ను పెంపునకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండేళ్లలో మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్‌కు నయాపైసా విడుదల చేయలేదని మండిపడ్డారు. కరీంనగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి ఉపయోగం లేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, కబ్జాలతో దోచుకుతిన్నారని ఆరోపించారు. పొరపాటున బీఆర్‌ఎస్ గెలిస్తే.. కమీషన్ల కోసం కేంద్ర నిధులను దారి మళ్లిస్తుందని అన్నారు. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి మొత్తం కేంద్రం నిధులతోనే అని చెప్పారు. తాను పైసలు తీసుకొస్తే.. బీఆర్‌ఎస్ నేతలు సిగ్గు లేకుండా కొబ్బరికాయ కొట్టి మావేనని చెప్పుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తెచ్చే బాధ్యత తనదన్నారు. గంగుల కమలాకర్ కు మూట ముల్లె సర్దుకుని కరీంనగర్ వదిలి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలి

### రాజ్యసభలో ఎంపీ లక్ష్మణ్



**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఐఏఎస్, ఐపీఎస్ తరహాలోనే అఖిల భారత న్యాయ సేవను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న విధానంతో కొన్నిఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీని స్థానంలో ఓ జాతీయ స్థాయి వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల మాదిరిగానే, న్యాయమూర్తుల ఎంపికకు కూడా ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో ప్రతిభావంతులైన యువతకు న్యాయ వ్యవస్థలో సరైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అఖిల భారత న్యాయ సేవ ఏర్పాటుతో ఎస్సీ , ఎస్టీ , బీసీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని లక్ష్మణ్ అన్నారు.

## సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఎ.ఎం.ఎస్) :** ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభం ఉందన్నారు. ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాలనను రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టామన్నారు. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతమన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామన్నారు. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందనీ తెలంగాణను భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తున్నామన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

## బిజెపి కోసం పనిచేస్తున్న ఇసి

మొదటి పేజీ తరువాయి

సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత, విలేకరులతో మాట్లాడుతూ, బెంగాల్‌లో సర్వసాధారణమైన చిన్న చిన్న స్పెల్లింగ్ తేడాలు, పేర్లలో మార్పుల కారణంగా ఓటర్ల దరఖాస్తులను రద్దు చేస్తున్నారని మమత ఆరోపించారు. వారు ముందుగా ప్రజల పేర్లను తొలగించారు. ఎన్నికల కమిషనర్ బీజేపీ ఐటీ సెల్ లాగా పనిచేస్తున్నారు. దీన్ని మీరు ప్రజాస్వామ్యం అంటారా? అని ఆమె ప్రశ్నించారు. బెనర్జీ , బంద్యోపాధ్యాయ, ముఖర్జీ, ముఖోపాధ్యాయ, లేదా చటర్జీ - చట్టోపాధ్యాయ వంటి స్పెల్లింగ్ తేడాల కారణంగా కూడా పేర్లను తొలగిస్తున్నారని బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో ఇంటిపేర్లు మారుతాయి. ప్రజలు తమ బిరుదులను మార్చుకుంటారు. బిరుదులు మారడం వల్ల పేర్లను కుదించి రాస్తున్నారు, అని ఆమె అన్నారు. ఇలాంటి తేడాలను అసాధారణతలుగా గుర్తించి ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగిస్తున్నారని ఆమె తెలిపారు. ఎలాంటి విచారణ జరపకుండానే ఏకంగా 58 లక్షల మంది ఓటర్లను తొలగించారని ఆమె ఆరోపించారు. వారు వ్యక్తులను కనీసం అడగను కూడా లేదు, అని ఆమె అన్నారు. ఈ ప్రక్రియ సమయంలో బూత్ స్థాయి అధికారుల (బిఎల్ఓ)లపై ఒత్తిడి పెడుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒత్తిడి అంతా బిఎల్ఓలపైనే ఉందని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీలు అసమాన రీతిలో ప్రభావితమవుతున్నారని బెనర్జీ ఆరోపించారు. ఎస్సీలను, మైనారిటీలను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? వారు మనుషులు కాదా? అని ఆమె ప్రశ్నించారు.

### బీజేపీ పాలిత అస్సాంలో ఎస్ఐఆర్ ఎందుకు లేదు?

ఈ సవరణ సమయాన్ని ప్రశ్నిస్తూ, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారని బెనర్జీ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఈ తొందర ఎందుకు? ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలను మీరు వదిలిపెట్టి ఉండాల్సింది, అని ఆమె అన్నారు. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని కూడా ఆమె ఆరోపించారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం ఉంది, అందుకే మీరు అక్కడ ఎస్ఐఆర్‌ను చేపట్టలేదు. మీరు బెంగాల్, కేరళ, తమిళనాడులను లక్ష్యంగా చేసుకుని, బీజేపీ పాలిత రాష్ట్రాన్ని వదిలేస్తున్నారు," అని ఆమె విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు భూ రికార్డులు, మాధ్యమిక సర్టిఫికేట్ల వంటి పత్రాలను ఉపయోగించడానికి అనుమతి ఇచ్చినప్పటికీ, బెంగాల్ కోసం నిబంధనలను మార్చారని బెనర్జీ ఆరోపించారు. తన దాడిని తీవ్రతరం చేస్తూ, ఇది ఎన్నికల సంఘం కాదు. ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్ కాదు. ఇది ఒక బీజేపీ ఏజెంట్. కేవలం ఒక ఏజెంట్ అని ఆమె ఘాటుగా విమర్శలు చేశారు. అవమానించారు, శుద్ధ అబద్ధాలను మాకు అంటగట్టారు. తాను చివరికి సమావేశం నుండి బయటకు వచ్చానని బెనర్జీ అన్నారు. నేను సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చాను. ఈ ఎన్నికల కమిషనర్ చాలా అహంకారి. మాతో దురుసుగా ప్రవర్తించారు. మమ్మల్ని అవమానించారు, అని ఆమె ఆరోపించారు. న్యాయం కోసమే తమ ప్రతినిధి బృందం వచ్చిందని పేర్కొంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ మాకు అబద్ధాల చెత్తను అంటగట్టారు. మేము ఇక్కడ న్యాయం కోసం వస్తే, మాకు అన్యాయం జరిగింది అని బెనర్జీ విమర్శించారు. నకిలీ ఓటర్ల అంశాన్ని లేవనెత్తినందుకు తృణమూల్‌ను నిందించడం ద్వారా కమిషన్ ఎస్ఐఆర్‌ను సమర్థించిందని, పోల్ ప్యానెల్ సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించిందని, ఈసీఐ దగ్గర మీడియా ప్రవేశాన్ని పరిమితం చేసిందని ఆమె ఆరోపించారు. నేను ఈ రకమైన ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎప్పుడూ చూడలేదు అని బెనర్జీ అన్నారు.

### ఎస్ ఐఆర్-బాధిత కుటుంబాలతో నిరసన

అంతకుముందు, బెనర్జీ, తృణమూల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఎంపీ కళ్యాణ్ బెనర్జీలతో కలిసి, ఎస్ ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రభావితమైనట్లుగా చెప్పున్న 12 మంది కుటుంబ సభ్యులతో కలిసి సిఇసిని కలిశారు. ప్రతినిధి బృందం నిరసనగా నల్ల దుస్తులు ధరించింది. అధికారిక రికార్డులలో చనిపోయినట్లు ప్రకటించినా, బతికి ఉన్న వ్యక్తులు, సవరణ ప్రక్రియకు సంబంధించిన ఒత్తిడి కారణంగా మరణించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల బంధువులు వీరిలో ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఈసీఐ వెలుపల పోలీసు భద్రతను పెంచారు. పార్లమెంటులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బెనర్జీ కూడా ప్రతిధ్వనిస్తూ, కొనసాగుతున్న వివాదం కార్యకలాపాలకు అంతరాయం కలిగించిందని అన్నారు. బిజెపి అధికారంలో కొనసాగితేనే మీ కుర్చీ ఉంటుంది. ఈ రోజు మీరు మీ కుర్చీని కాపాడుకోవచ్చు, రేపు మీరు కాపాడుకోలేరు అని ఆమె అన్నారు.

## రెబెల్ గా పోటీ చేస్తే పార్టీ నుంచి సస్పెండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** ఎవరైనా పార్టీ నిబంధనలు అతిక్రమించి మున్సిపల్ ఎన్నికల్లో రెబల్స్‌గా బరిలోకి దిగితే కనికరం లేకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుహెచ్చరించారు. నామినేషన్లు వేసిన ఇతర అభ్యర్థులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పార్టీ బీఫామ్‌లు ఇచ్చిన అభ్యర్థులకు అందరూ సహకరించాల్సిందే అని తేల్చి చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాలన్నీ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అత్యధిక పుర పీఠాలపై కాషాయ జెండా ఎగురవేసి.. ప్రధానమంత్రి నరేంద్రమోడికి బహుమతిగా ఇద్దామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ బలపడుతుందనీ.. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ పాలన మనం చూద్దామన్నారు. ఈ క్రమంలో మూడేళ్ల కాంగ్రెస్ పాలనను అరాచక, అవినీతి పాలన అని అభివర్ణించారు. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరిట భారీ కుంభకోణం జరుగుతోందని రాంచందర్ రావు విమర్శించారు. ఇప్పటి వరకు రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తుచేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానం గా మారా యన్న ఆయన పార్టీ అధ్యక్షుడు నిత్యం రోడ్డు ప్రమాదాలతో అనేక మంది మరణిస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నేరాలు విపరీతం గా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చే శారు. శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. తెలంగాణ డ్రగ్స్‌కు కేరాఫ్ గా మారిందని ఆరోపించారు.

## తెలంగాణకు యూనివర్సిటీ టౌన్‌షిప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి పెద్దపీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లలో ఒకటి తెలంగాణకు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ బడ్జెట్‌లో కేంద్రం విద్యా రంగానికి కేటాయింపులు పెంచడంతో.. తెలంగాణకు వచ్చే నిధులు కూడా భారీగా పెరగనున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి బడ్జెట్‌లో 6.22 శాతం అధికంగా కేటాయించడం విశేషం. తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ కారిడార్ రైళ్లను ప్రకటించిన కేంద్రం..... ఇందిరమ్మ ఇళ్లకు పీఎం ఆవాస్ యోజన కింద భారీగా నిధులు కేటాయించింది. వీటితో ఈ బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి కూడా పెద్ద పీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. కేంద్రం బడ్జెట్‌లో ఈ సంవత్సరానికి గాను విద్యా రంగం కేటాయింపులను భారీగా పెంచారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాయాలు(కేవీ), జవహర్ నవోదయ విద్యాలయాలు(జేఎన్‌వీ)ను మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 కేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో ములుగు, జగిత్యాల, కొత్తగూడెం, వనపర్తి జిల్లాలకే కేంద్రం ఇటీవల కేవీలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి.



# గ్రేటర్ హైదరాబాద్



# వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

**కలెక్టర్ నారాయణరెడ్డి**

**ఇంటర్ పరీక్షలపై అధికారులతో సమీక్ష సమావేశం**



**రంగారెడ్డి, ఫిబ్రవరి 02 (వుదయం) :**

ఫిబ్రవరి 25వ తేదీ నుండి ప్రారంభ మయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇంటర్ పరీక్షలపై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలో 200 పరీక్షా కేంద్రాల ద్వారా 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70,171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు. పోలీస్ శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది



కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన్ ఫర్నీచర్ ఉండేలా చూడాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు మౌలిక సదుపాయాలు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ ను నియమించి పరీక్ష కేంద్రంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, మెడికల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్ లు, విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ.. ప్రజల విన్నపాలు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణు గోపాల్, సత్యనారాయణ, మంగతాయారు, చీఫ్ ఇంజినీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు సీసీపీ జోన్‌లు రంజిత్ కుమార్, వెంకన్న, ప్రదీప్ కుమార్, జాయింట్ కమిషనర్ రెవెన్యూ, జేసీ (పరిపాలన) జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి**

**వికారాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

ప్రజలందరికీ నాణ్యమైన ఆహారం అందాలనే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుధీర్ లు ఆహార భద్రతపై వివిధ సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతి గృహాల్లో, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ఆహార భద్రత నియమాలను పాటించాలన్నారు. అంగన్వాడి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో అందిస్తున్న భోజనాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల్లో, పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న హోటళ్లకు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భోజన నమూనాలను సేకరించి నాణ్యతలను పరిశీలించాలని వారు అధికారులు సూచించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాడు కాకుండా పరిసరాలు పారిశుధ్యంగా ఉండేలా ఆహార అభద్రత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డిపిఓ జయసుధ, డిఇఓ రేణుకాదేవి, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, ఆహార భద్రత అధికారి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకునేందుకు భార్య యత్నం..

## స్టూల్ తన్నేసిన భర్త

**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**



ఆత్మహత్య చేసుకుంటానంటూ భర్తను బెదిరించి భార్య స్టూలెక్కి ఉరి వేసుకునేందుకు ప్రయత్నించంది. మద్యం మత్తులో ఉన్న భర్త స్టూలును కాలితో తన్నడంతో ఊపిరి ఆడక మరణించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫిలింనగర్‌కు చెందిన కొండల్ కూలీగా పని చేస్తాడు. కొన్నేళ్ల క్రితం అరుణతో వివాహం అయింది. అరుణ ఓ మెడికల్ షాపులో పనిచేస్తోంది. కాగా, కొండల్ రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. శనివారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అప్పుడే విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన భార్యతో గొడవకు దిగాడు.

ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో కొండల్ భార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో అరుణ ఆత్మహత్య చేసుకుంటానంటూ స్టూల్ వేసుకొని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీ బిగించింది. భర్తను బెదిరిద్దామని స్టూలు వేసుకొని ఉరి పెట్టుకోగా మద్యం మత్తులో ఉన్న కొండల్ స్టూల్‌ను తన్నాడు. దీంతో అరుణ ఊపిరి ఆడక మరణించింది. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రశ్నించగా అరుణ ఆత్మహత్య చేసుకుందని కొండల్ చెప్పాడు. అయితే మృతురాలి కుమారుడు తన తండ్రి స్టూల్ తన్నడం వల్లనే తల్లి మరణించిందని చెప్పడంతో పోలీసులు కొండల్‌ను అదుపులోకి ప్రశ్నించగా నేరం ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**




**వికారాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

జిల్లా లో 2 వ సాదారణ మున్సిపల్ ఎనికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. సోమవారము కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియమ నిభందనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రానికి పూర్తి బాధ్యత వహించాలని, చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకునే అదికారము ఉంటుందని, పోలింగ్ సామగ్రి స్వీకరించి తనికి చేసుకోవాలని, ఒక ఓటర్ ఒక్క ఓటు నిబంధన పాటించాలని, మహిళలకు, వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరము పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వార మాస్టర్ ట్రైనర్స్ తో ఎనికల విధుల పై అవగాహనా కలిపించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి, నాగరాజు, నటరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 5 నుంచి పహాడీషరీఫ్ దర్గా ఉత్సవాలు

- కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- 760వ ఉర్సు ఉత్సవాల వాల్ పోస్టర్ విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

ఈనెల 5 నుంచి వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే పహాడీషరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. బాబా షర్ఫుద్దీన్ బాబా దర్గా 760వ ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిను దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఉత్సవాల పోస్టర్‌ను కమిటీ సభ్యులు, జల్‌పల్లి, పహాడీషరీఫ్, షహీన్ నగర్ కాంగ్రెస్ ప్రతినిధులతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... దర్గా ఉత్సవాలు జరిగే వరకు విద్యుత్, శానిటేషన్, తాగునీరు, మున్సిపల్ అధికారులు, పోలీస్ వ్యవస్థలు ప్రభుత్వం తరపున అందుబాటులో ఉండాలని సూచించారు. పహాడీషరీఫ్ దర్గా ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా పండుగ వాతావరణం నెలకొనాలని స్థానికంగా ఉండే నాయకులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ నాయకులు, ముస్లిం నాయకులు, దర్గా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి
- జలమండలి అధికారులతో కలిసి సూర్య నగర్ కాలనీలో పర్యటన



**హయత్ నగర్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

హయత్ నగర్ డివిజన్‌లోని సూర్య నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ ఎక్స్టెన్షన్ సమస్యపై కాలనీ వాసులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడంతో, నేడు జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ సూర్య నగర్ కాలనీలో పర్యటించి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్య నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ ఎక్స్టెన్షన్ పనులకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా జలమండలి ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీవాసులు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరి ష్కారం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, హయత్ నగర్ డివిజన్ అభివృద్ధిలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని స్పష్టం చేశారు.

అలాగే అధికారులు వెంటనే సాంకేతిక పరిశీలన పూర్తి చేసి, పనులు త్వరితగతిన ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జలమండలి మేనేజర్ రాజు, సూపెర్వైసోర్ బాలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితెరులు పాల్గొన్నారు.

**టోర్నమెంట్‌ను ప్రారంభం..**

హయత్ నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన చీఫ్ మినిస్టర్ కప్ టోర్నమెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌లో నిర్వహిస్తున్నకోకో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో పాల్గొంటూ విద్యార్థులు తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే, మండల్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు ఎదిగి, రాష్ట్రానికి పేరు తీసుకొచ్చే క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. హయత్ నగర్ డివిజన్‌లో విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇస్తూ, టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హయత్ నగర్ ఎమ్మార్వో జానకి, ఎంఈవో శ్రీనివాస్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్ ప్రిన్సిపాల్ అని ప్రియదర్శిని, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు జాంజా నాయక్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యం

**ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 02 (వుదయం) :**

మన్సూరాబాద్ డివిజన్ (ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ డివిజన్) పరిధిలోని రాజ రాజేశ్వరి కాలనీ ఫేస్-2 వారి కమ్యూనిటీ హాల్‌ను సోమవారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ వారు తమ సొంత నిధులు (సుమారు రూ.45 లక్షలతో) ఈ కమ్యూనిటీ హాల్ భవనం ఏర్పాటు చేసుకున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు పని చేసినపుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందని, నియోజకవర్గ పరిధిలోని ప్రతీ కాలనీని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అనంతరం పలు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన అభ్యర్థనలను వెంటనే పరిశీలించి, వారికి కావాల్సినవి ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్ నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, కొసనం వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, విజయేందర్‌రెడ్డి, అనిల్ కుమార్, నాగార్జున, పరమేశ్‌గౌడ్, పారంద నర్సింగ్, కాలనీ అధ్యక్షులు మాధవ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం వారు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 02 (వుదయం) :**

జిల్లాలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్ 81253 52721 కు కాల్ చేసి వివరాలు తెలుపాలని సూచించారు. ఈ హెల్ప్‌డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని తెలిపారు. హెల్ప్‌డెస్క్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును తక్షణమే నమోదు చేసి పరిశీలించి, ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వేగవంతమైన చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## ఈ నెలాఖరులో హైదరాబాద్ జిల్లా మహాసభ

- టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు
- 25 వరకు సభ్యత్వ నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం) :**



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా మహాసభ ఈనెల చివరి వారంలో నిర్వహించాలని ఫెడరేషన్ జిల్లా అడ్ హక్ కమిటీ నిర్ణయించింది. సోమవారం సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో అడ్ హక్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ వి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, జిల్లా కో-కన్వీనర్లు పాల్గొని హైదరాబాద్ జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యల, సంఘ నిర్మాణాంశాలపై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను ఫెడరేషన్‌లో సభ్యులుగా చేర్చుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కమిటీల ఎన్నిక జరపాలని, ఈ నెల చివరి వారంలో జిల్లా మహాసభ జరపాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, అనేక మీడియా సంస్థలకు కేంద్ర బిందువైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో దాదాపు నాలుగైదు వేల మంది జర్నలిస్టులున్నారని, వీరిలో రిపోర్టర్లతో పాటు సబ్ ఎడిటర్లుగా పిలవబడే డెస్క్ జర్నలిస్టులు, ఫోటో, వీడియో జర్నలిస్టులున్నారని అన్నారు. జర్నలిస్టుల్లో ఐక్యత లేకపోవడం వల్ల అనేక ఏళ్ళుగా కనీస హక్కులను సాధించుకోలేక అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇండ్ల స్థలాలు పొందలేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పాలనకు కేంద్రం, పాలకులకు నిలయంగా ఉన్న హైదరాబాద్ నగరంలో పాత్రికేయులకు నివేశ స్థలాలు లేకపోవడం శోచనీయమని, గత పాలకులు జర్నలిస్టులకు అన్యాయం చేశారని, ఈ ప్రభుత్వం కూడా సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జర్నలిస్టులను ఐక్య పరిచి సమస్యలపై త్వరలో కార్యాచరణ చేపట్టాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. జిల్లా, రాష్ట్ర మహాసభల తర్వాత జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త యాత్ర ఉంటుందని ఆయన ప్రకటించారు.

సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, జిల్లా కో-కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, పి.సంతోష్ కుమార్, సీహెచ్ బ్రహ్మం, ఎం. రవికుమార్, నాయకులు పద్మారావు, సంపత్ కుమార్, ఆర్. రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు హైదరాబాద్ జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు.

**IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE :: CITY CIVIL COURT AT HYDERABAD**

**O.S. No. 194 OF 2026**

**Between:**

Challa Naveen Kumar and others

**... Plaintiff**

AND

The Tahsildar and others

**... Defendants**

To,

All concerned.

Please take notice that the above named i.e., Challa Naveen Kumar & others have filed the above suit for declaration of legal heirs of Late Challa Kishan @ Krishna and Late Challa Sri Laxmi @Komsalia against you, on the above said Hon'ble Court was please to order public notice in the said newspaper as such you are hereby informed that the above said suit is posted on **25-02-2026** for your appearance if any, that if you failed to appear before the Hon'ble Court on the above said date at 10:30 am in that case you will be set ex parte and the matter will be decided as per Law.

**(BY ORDER OF THE COURT )**

**M/s V.SIDDHARTH**
Advocate
#14-6-284, Chudi Bazar, Begum Bazar,
Hyderabad.
Cell: 8019811782



"గత పదేళ్లలో 25 కోట్ల మంది భారతీయులను బహుముఖీన పేదరికం నుంచి కాపాడాము. దేశంలోని ప్రతి రైతు, షెడ్యూల్డు తెగ (ఎస్టీ), షెడ్యూల్డు కుల (ఎస్సీ), మహిళ, యువత, పేద ప్రజలందరికీ మేలు చేయడానికే బడ్జెట్ లక్ష్యంగా పెట్టుకుంటుంది. దేశంలో పేదలనే వారు లేరు, పేదల మాదిరిగా నటించే వాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. బంగారాన్ని వెండిని వారు విపరీతంగా కొంటున్నారు. వృద్ధిని పెంచడానికి, సమ్మిళిత అభివృద్ధిని చేకూర్చడానికి అదే పనిగా కృషి చేస్తాం."

– ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## వే'మన'పద్యం

**కోతి నొనరదెచ్చి క్రొత్తపుట్టముగట్టి**
**కొండముచ్చులెల్ల గొలిచినట్లు**
**నీతిహీనునొద్ద నిర్భాగ్యులుండుట**
**విశ్వదాభిరామ! వినురవేమ.**



## సంపాదకీయం

# సంక్షేమానికి గడ్డు కాలం?

వ్యయం ఎక్కువ, వనరులు తక్కువ గల ఇంటి బడ్జెట్‌లు ఎప్పుడూ అనేక విధాలైన లోపాలు కలిగి ఉంటాయి. అటువంటి దేశాల వార్షిక బడ్జెట్లు కూడా అలాగే ఉంటాయి. అందుకే మన బడ్జెట్ లు జవసత్వాలు లేక మూలుగుతున్న నక్కల మాదిరిగా ఉంటాయి.ఆ క్షణానికి కేటాయింపులను పెంచినా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఆయా రంగాలకు చేసిన ఖర్చు పరిమితంగా ఉంటుంది. ఆ విషయాలు మరుగున పడిపోతాయి . బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు చేసిన కేటాయింపులే మీడియాలో తాటికాయలంత అక్షరాలతో దర్శనమిస్తాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం నాడు ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ కూడా అలాంటిదే.తయారీ రంగాన్ని పెంపొందించడం, సమ్మిళిత అభివృద్ధిని సాధించడం వంటి ఆదర్శ లక్ష్యాలను సాధించడమే బడ్జెట్ లక్ష్యమని మంత్రి ప్రకటించారు. పదేళ్ల తమ పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి పైకి తెచ్చామని ప్రకటించిన నిర్మలా సీతారాం దేశంలో పేదలే లేరని ఉన్నవారంతా పేదలుగా నటిస్తున్న వారేని, వారు వెండి బంగారాలు కొనుగోలు చేయడంలోనే విషయం అర్థమవుతున్నదని చేసిన వ్యాఖ్య ప్రధాని మోడీ ప్రభుత్వం ఆలోచన అర్థమవుతున్నది. దేశ జనాభాలో సగానికి పైగా అంటే 82.35 కోట్ల మంది జాతీయ ఆహార భద్రత పథకం కింద రేషన్ కార్డుల ద్వారా పూర్తిగానో పాక్షింగానో ప్రభుత్వం నుంచి ఆహార ధాన్యాలు పొందుతున్న దేశంలో పేదలు లేరు, అందరూ నకిలీలేనని మంత్రి అన్నారంటే పేదల సంక్షేమ బాధ్యతల నుంచి క్రమ క్రమంగా తప్పుకోవడమే మోడీ ప్రభుత్వ ఉద్దేశమని అనిపిస్తే కాదనగలమా?కొన్ని సంక్షేమ పథకాల భారాన్ని రాష్ట్రాలమీదికి తోసివేసిన కేంద్రం మరి కొన్నింటికి కేటాయింపులను తగ్గించివేసింది.గ్రామీణ అభివృద్ధి రంగానికి నిధులను ఈ బడ్జెట్ లో 30 శాతం కోసేశారు. సమగ్ర శిక్షా పథకం ఖర్చును భారీగా తగ్గించి వేశారు.ఇలా మరికొన్ని సంక్షేమ పథకాలకు నిధులను తగ్గించి వేశారు.మనది 300 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అని మరింతగా చాటుకోడానికి, పేదరికం మచ్చుకైనా లేదని చెప్పడానికి ఒక పథకం ప్రకారం కృషి జరుగుతున్నదా అనే అభిప్రాయం కలుగుతున్నది. అయితే దేశాన్ని ఆధునిక పథంలో ముందుకు తీసుకువెళ్లాలన్న తపన బడ్జెట్ లో కనిపించింది.యువతకు నైపుణ్యాలను కల్పించి వారి లో పోటీ తత్వాన్ని పెంచడం, ఆరోగ్య రంగంపై దృష్టి పెట్టడం వంటి మంచి విషయాలు ఉన్నాయి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# దేశ దేశాల సైనిక పాటవాలు

డెబ్బయ్ ఏడవ రిపబ్లిక్ దినోత్సవం రోజున మన సైనిక బలగాల సత్తాను ప్రదర్శించారు. న్యూఢిల్లీ కర్తవ్యపథ్‌లో జరిపిన కవాతును చూసి దేశం యావత్ పులకించిపోయింది.ప్రతి దేశం రిపబ్లిక్ దినోత్సవం లేదా స్వాతంత్ర్య దినోత్సవం, ఇతర ముఖ్య ఉదంతాలు ఉంటే ఆరోజున ఇలాంటి విన్యాసాలను ప్రదర్శించి తమ శక్తి ఇదని ప్రపంచానికి చాటుతున్నాయి. ఈ సందర్భంగా కొందరు విశ్లేషకులు, కొన్ని టీవీ ఛానళ్లు ప్రసారం చేసిన కథనాలు, విశ్లేషణల్లో అతిశయోక్తులు దొర్లాయి.ఈ నేపథ్యంలో ప్రపంచ మిలిటరీ బలం బలగాల గురించి పరిమితంగా అయినా ఒక్కసారి అవలోకనం చేసుకోవటం అవసరం. హిందూ మహాసముద్రం భారతదేశానిదే అని ఒక విశ్లేషకుడు చెప్పారు. ఒక దేశ సరిహద్దు నుంచి 12 నాటికల్ మైళ్ల(ఒక్కో నాటికల్ మైలు 1.852 కిలోమీటర్లకు సమానం) వరకు ఆయా దేశాలకు సర్వహక్కులు ఉంటాయి.పన్నెండు నుంచి 24 నాటికల్ మైల్స్ వరకు కస్టమ్స్, వలసలు,కాలుష్యాలకు సంబంధించిన చట్టాలు అమలు చేసే అధికారం ఉంటుంది.రెండువందల నాటికల్ మైల్స్ వరకు సముద్ర ఉత్పత్తులు,ఆ పరిధిలో ఉన్న ఖనిజవనరులను తవ్వితీసుకొనే హక్కు ఆయాదేశాలకు ఉంటుంది. ఆపైన ఉండే ప్రాంతం అంతర్జాతీయ జలాలుగా పరిగణిస్తారు. శ్రీలంక–భారత్ మధ్య దూరం 288 కిలోమీటర్లు మాత్రమే ఉన్నందున సమదూరంతో సరిహద్దుల నిర్ణయం జరిగింది. నిజానికి హిందూమహాసముద్రం అంటే మనదేశ సరిహద్దులకు మాత్రమే పరిమితం కాదు. పొడవు 9,600, వెడల్పు 7,600 కిలోమీటర్లు ఉంది.మనదేశానికి ఇది మూడువైపుల ఉంది. దీనిలో అందరికీ తెలిసిన అరేబియా సముద్రం, బంగాళాఖాతం,మరికొన్ని ప్రాంతీయ సముద్రాలు ఉన్నాయి.వీటన్నింటినీ కలిపి హిందూ మహాసముద్రం అంటున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండం వరకు విస్తరించి ఉంది.

మనదేశం వద్ద 1,500 కిలోమీటర్ల దూరంలోని యుద్ధ నౌకలను దెబ్బతీసే సామర్థ్యం గల దీర్ఘశ్రేణి క్షిపణి (ఎల్ఆర్–ఎఎస్‌హెచ్ఎం)తో చైనా,అమెరికా నౌకలను కూడా దెబ్బతీయగలవని విశ్లేషకుడు చెప్పారు. అది నిజమే, ఎప్పుడు యుద్ధం వచ్చినపుడు, ఎదుటి వారు దాడికి దిగనంతవరకు మాత్రమే.హిందూమహాసముద్ర అంతర్జాతీయ జలాల్లో ప్రవేశించిన ఏ దేశనౌకనైనా వెంటనే పేల్చివేయటానికి ఉండదు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే అలాంటి క్షిపణులను తయారు చేసే దేశంగా మనం ఇటీవలనే సామర్థ్యం సంపాదించుకున్నాం.మనకంటే బలమైన మిలిటరీ శక్తి ఉన్న విషయాన్ని దాచి ప్రపంచంలో మనకు ఎదురులేదని ఎవరైనా చెపితే అది వాట్సాప్ పాండిత్యం తప్ప మరొకటి కాదు. వర్తమాన బలాబలాల గురించి ఈ సందర్భంగా చూద్దాం.మన దగ్గర ఐదువేల కిలోమీటర్ల దూరం ప్రయోగించగల ఖండాంతర క్షిపణి అగ్ని–5 ఉంది. ఇతర దేశాలలో మినిట్‌మాన్– అమెరికా క్షిపణి 13,000 కిమీ, రష్యాలో ఆర్ఎస్– 28 శాటమాన్ క్షిపణి పదకొండు వేల కి.మీ, చైనా వద్ద డాంగ్ ఫెంగ్–41 రకం తొమ్మిదివేల కిలోమీటర్లు ప్రయాణించగలవి ఉన్నాయి. ఉత్తర కొరియా వద్ద గరిష్టంగా 15వేల కిలోమీటర్లు ప్రయాణించే క్షిపణి తయారీలో ఉన్నట్లు ఊహాగానాలు. దాని వద్ద శక్తివంతమైన దీర్ఘశ్రేణి క్షిపణులు ఉన్నకారణంగా తేడా వస్తే తన మిత్రదేశంగా ఉన్న జపాన్ మీద ప్రయోగించగలదనే భయంతోనే అమెరికా ఒళ్లు దగ్గరపెట్టుకొని వ్యవహరిస్తున్నది. ఇలా ఒకరిని మించి ఒకరు తమ ఆయుధాలకు పదునుపెట్టుకుంటున్నారు.ఇప్పటికే ప్రపంచంలో చైనా



నావికాదళశక్తిలో ఒకటవ స్థానంలో ఉంది. అమెరికా వద్ద అన్ని రకాల యుద్ధ నావలు 471 ఉండగా చైనా 1,025 భారత్ 290 మాత్రమే కలిగి ఉన్నాయి. అయితే అమెరికా వద్ద విమానవాహక యుద్ధ నౌకలు 11, చైనా దగ్గర మూడు, భారత్ వద్ద రెండు ఉన్నాయి. ఈ పూర్వరంగంలో మనదేశం కూడా తగిన జాగ్రత్తలు తీసుకొని ఆయుధాలను తయారు చేసుకోవాల్సిందే అనటం నిర్వివాదాంశం. దీనిలో భాగంగానే అణ్వస్త్రాలను తయారు చేసుకొనే అవకాశాలను అట్టిపెట్టుకొని అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకాలు చేసేందుకు నిరాకరించాం.గతంలో రెండుసార్లు మనం అణుపరీక్షలు జరిపినపుడు మిత్రదేశం అంటూనే మన మీద కక్షతో అమెరికా ఒక్కటే ఆంక్షలు విధించింది.శత్రువైరుధ్యాలు ఉన్నప్పటికీ చైనా అలాంటి చర్యలకు పాల్పడలేదు. మానవాళికి ముప్పు తెచ్చే యుద్ధాలు వద్దనే ప్రతి ఒక్కరూ కోరుకోవాలి. కానీ ఉన్మాదంతో కొందరు ఊగిపోతున్నారు. పదిహేను వందల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని దెబ్బతీసే మన తాజా క్షిపణి ధ్వని వేగం (గాలిలో గంటకు 1,225కిలోమీటర్లు) పది మాక్‌లంటే 12,250 కి.మీ వేగంతో ప్రయాణిస్తుందని పావు గంటలోనే పని ముగిస్తుందని చెబుతున్నారు. ఇది మన డిఆర్‌డిఓ శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం. అయితే వారు ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. రష్యా వద్ద 27 మాక్‌ల అవన్‌గార్డ్, చైనా వద్ద 27మాక్‌ల డిఎఫ్–41, అమెరికా దగ్గర ట్రైడెంట్ 24, మినిట్‌మాన్ 23,రష్యా వద్ద 20.64మాక్‌ల క్షిపణులు ఉన్నాయి. అందువలన మాదేవుడే అందరికీ అంటే ఎలా అంగీకరించటం లేదో ఇది కూడా అంతే. మన గొప్ప గురించి మనం చెప్పుకోవచ్చు తప్ప మనమే గొప్ప అంటే జనాలను తప్పుదారి పట్టించినట్లే. మన మిలిటరీ అజేయమే అయితే నరేంద్రమోడీ మన ఆక్రమిత కాశ్మీర్‌ను ఎందుకు వెనక్కు తీసుకురాలేదు, ఆపరేషన్ సింధూర్‌లో మరికొంత మందుకు పోయి ఉంటే పని జరిగేది కదా అని అనేక మంది అనుకుంటున్న సంగతి తెలిసిందే.ప్రస్తుతం యుద్ధాల్లో కావాల్సింది ఎప్పటి సమాచారాన్ని అప్పుడు తెలియచేసే పరిజ్ఞానం. ఉక్రెయిన్‌కు అలాంటి సత్తాలేనప్పటికీ పశ్చిమ దేశాలు అందచేసిన సమాచారంతో గడచిన నాలుగు సంవత్సరాలుగా రష్యాను అడ్డుకోవటమే గాక, కొన్ని దాడులు కూడా చేయగలుగుతున్నదంటే కారణం అదే. ఆపరేషన్ సింధూర్‌లో తొలి రోజు మనకు ఎదురుదెబ్బలు తగలటానికి కారణం పాకిస్తాన్‌కు పశ్చిమదేశాలు(అమెరికాతో సహా) అందించిన సమాచారమే కారణంగా కొందరు భావిస్తున్నారు.

అందుబాటులో ఉన్న తాజా సమాచారం ప్రకారం మిలిటరీ అవసరాల కోసం వినియోగించే ఉపగ్రహాలు అమెరికా వద్ద 247, చైనా 157, రష్యా 110,ఫ్రాన్స్ 17, ఇజ్రాయెల్ 12, ఇటలీ 10, మనదేశం 9, జర్మనీ 8,బ్రిటన్ 6, స్పెయిన్ 4 కలిగి ఉన్నాయి.అందువలన భూమి చుట్టూ తిరిగే అవి ఒకదాని వెనుక ఒకటి సమాచారాన్ని పసిగడితేనే 24గంటల్లో ఏం జరుగుతుందనేది తెలుసుకోవచ్చు.మిలిటరీతో సహా అన్ని అవసరాలకుగాను అమెరికా 5,176, బ్రిటన్ 653, చైనా 623, రష్యా 181, జపాన్ 88 కలిగి ఉండగా మనదేశం 62 కలిగి ఉంది. అయితే ఈ ఉపగ్రహాలు సేకరించే సమాచారం కూడా మిలిటరీ అవసరాలకు ఉపయోగపడుతుంది.ఈ కారణంగానే ప్రపంచంలో ఏమూల ఏమిజరిగినా అమెరికా ఇట్టే పసిగడుతున్నదంటే ఈ వ్యవస్థలే కారణం. ఇటువంటి ఏర్పాట్లు ఉన్నప్పటికీ ప్రపంచానికి భద్రత లేదని, తనకు అన్ని వైపుల నుంచీ ముప్పు ఉన్నదని అమెరికా ప్రపంచాన్ని నమ్మించేందుకు గోబెల్స్ ప్రచారం చేస్తున్నది. గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని తాము ఆక్రమిస్తామని చెప్పిన ట్రంప్ తమ దేశ రక్షణకు ఉన్న " గోల్డెన్ డోమ్ " వంటిదాన్నే ఆ ప్రాంతానికి కూడా ఏర్పాటు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఏమిటిది అంటే గగనతలం నుంచి జరిగే దాడుల నుంచి రక్షణ కల్పించటం.మన రామాయణ, మహాభారత కథలో అలాంటివి చూసే ఉంటారు. రాక్షసులు యాగాన్ని కొనసాగ నివ్వకుండా చేసేందుకు చూస్తే రక్షణగా రాముడిని నియమించిన సంగతి, మహాభారతంలో బాణాలతో అర్జునుడి పరాక్రమం తెలిసిందే.కొన్ని దశాబ్దాలకు ముందే అమెరికా హాలీవుడ్ స్టార్‌వార్స్‌పేరుతో సినిమాలు తీసింది. ఇప్పుడు నిజంగానే అలాంటి గగనతల యుద్ధాలు జరుగుతున్నాయా ? అమెరికా కనుసన్నలలో పని చేసే సంస్థలు, కొందరు వ్యక్తులు రష్యా, చైనా ఈ రంగంలో ముందున్నాయని, ప్రపంచానికి ముప్పు ఉందని ప్రచారం చేస్తున్నారు. తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడు ఉంటాడన్నట్లుగా తెలివి ఏ ఒక్కరి సొత్తూ కాదు. అంతా రహస్యంగా జరుగుతున్న వ్యవహారం గనుక ఈ పోటీ గురించి చెబుతున్న అంశాలను అవుననీ, కాదని చెప్పలేము.

భూ కక్ష్యలో ఉపగ్రహాలను దెబ్బతీసే సాంకేతిక పరిజ్ఞానం(ఎసాట్) ప్రతిదేశం కలిగి ఉండాలని అందరూ చెబుతున్నారు. గగనతల కేంద్రంగా ఆయుధాలు కావాలని అమెరికా మిలిటరీ నిపుణులు బహిరంగంగానే చెప్పారు.ఈ విషయంలో రష్యన్లు, చైనీయులు తమ సామర్థ్యాలను ఎంతో ఆధునికంగా కనపరుస్తున్నారని, దాన్ని కాదనలేమని బ్రిటన్‌లోని డుర్హామ్ విశ్వవిద్యాలయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం సహడైరెక్టర్ బ్లెడిన్ బోవెన్ చెప్పాడు. నిజంగా అలాంటి వేదికలు ఇప్పుడు ఉన్నాయో లేదో చెప్పలేము గానీ అవసరమైన సాంకేతికతలను వారు చూపుతున్నారని అన్నాడు. ఒక ఉపగ్రహాన్ని నేరుగా దెబ్బతీయటం,ఇతరంగా కూల్చివేయటం వాటిలో ఒకటి.భూతలం నుంచి సముద్రాల్లో నౌకలను ముంచివేయటం, టెర్మినళ్లను దెబ్బతీయటం, ఎలక్ట్రానిక్స్ ద్వారా చేసేవన్నీ గగనతల పోరులో భాగమే అన్నాడు. ప్రస్తుతం ఉక్రెయిన్ పోరులో స్పేస్ ఎక్స్ స్టార్‌లింక్ వంటి ప్రైవేటు ఉపగ్రహసేవలను అందించేవారు రష్యన్ల ఆయుధాలను పనిచేయకుండా అడ్డుకుంటున్నారని, సైబర్‌దాడులకు పాల్పడుతున్నారని, అదే విధంగా రష్యా నుంచి సంకేతాలను అడ్డుకోవటాన్ని గమనించినట్లు బోవెన్ చెప్పాడు. గగనతల దాడు ఆయుధాలను తయారు చేయకూడదన్న ఒప్పందాల మేరకు నాడు సోవియట్ వెనక్కు తగ్గిందని ఇప్పుడు రష్యా తిరిగి పూనుకున్నట్లు కనిపిస్తున్నదని రాండ్ స్కూల్ ప్రొఫెసర్ బ్రూస్ ఎం క్లింటాక్ ఆరోపించాడు. సాధారణంగా గగనతలంపై రష్యా పరిమితంగానే ఆధారపడుతుందని, అదే అమెరికా తన ఆర్థిక వ్యవస్థ, యుద్ధాలకు గరిష్టంగా ఆధారపడుతున్నది. రోజువారీ ఉపగ్రహ ప్రయోగాలను చూస్తే చైనా కూడా అదే బాటలో ఉన్నట్లు కనిపిస్తున్నదని క్లింటాక్ చెప్పాడు. ముందే చెప్పుకున్నట్లు ట్రంప్ ప్రస్తావించిన "గోల్డెన్ డోమ్ " ఏర్పాటుకు 1983 నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ప్రకటించిన స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ నాంది. దీన్నే స్టార్‌వార్స్ అని పిలిచారు.దీనిలో గగనతలంలో ఉండే పరికరాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే గోల్డెన్ డోమ్ వ్యవస్థ అణ్వాయుధాల నుంచి రక్షణ కల్పించలేదు గానీ ఇతరంగా ఎంతో ఉపయోగం అని బోవెన్ చెప్పాడు. గతంలో ఎదురైన అనేక సాంకేతిక సవాళ్లను అధిగమించారని, గగనతలంలో అడ్డుకోవటం సంక్లిష్టమైనదని, వాటిని వేగంగా రూపొందించటం, పరీక్షించటం అంతతేలిక కాదని అంటున్నారు.

అంతరిక్ష రంగంలో మనదేశం అనేక విజయాలను సాధించింది. అయితే ఇంకా ఎంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉంది.చైనా తన సోషలిస్టు వ్యవస్థను కాపాడుకొనేందుకు అమెరికాతో పోటీ అని చెప్పకపోయినప్పటికీ మిలిటరీ రీత్యా బలాన్ని పెంచుకుంటున్నది, ఆర్థికంగా దానికా శక్తి ఉంది. అనేక దేశాల అనుభవాలను చూసినపుడు మిలిటరీ మీద అవసరమైనదాని కంటే ఎక్కువ ఖర్చు చేస్తే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవు.మనదేశం 109 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తుంటే (జిడిపి 4లక్షల కోట్ల డాలర్లు) చైనా 303 బిలియన్ డాలర్లు (జిడిపి 19లక్షల కోట్ల డాలర్లు) వెచ్చిస్తున్నది.అమెరికా 831 బిలియన్ డాలర్లు (జిడిపి 30లక్షల కోట్ల డాలర్లు) కేటాయించింది.తన ఆయుధ ప రిశ్రమలకు లబ్ది చేకూర్చేందుకు అమెరికా వెచ్చిస్తున్నది, చైనా స్వంతంగా తయారు చేసుకొనేందుకు పూనుకుంది.మనం ఇతర దేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేస్తున్నాం. అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేస్తే ఓకే, మనం కూడా ప్రపంచ శక్తిగా ఎదగాలంటే పోటీపడే ఆర్థిక శక్తి ఉందా లేదా అన్నది ముందు చూసుకోవాలి !



ఎం కోటేశ్వరరావు
8331013288

## స్మగ్లింగ్ నిరోధంలో
# తీర దళం కీలకం

1977 ఫిబ్రవరి 1వ తేదీ భారత తీర రక్షణ దళం ఉనికిలోకి వచ్చిన దినం. భారత తీర రక్షణ దళం... నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర , రాష్ట్ర పోలీసు దళాల సహకారంతో పని చేస్తుంది. 1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్ట మ్స్ శాఖ వారికి తీర గస్తీకి నౌకదళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పాట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికాదళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదించింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికాదళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971 లో, భారతదేశం లోని విస్తారమైన తీర ప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్థవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది సంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది. 1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక చట్ట అమలు పనుల కోసం భారత నావికా దళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు. రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తాంజీ అధ్యక్షతన రుస్తాంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత మరియు చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికి భారత నావికాదళం, కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాలు, బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు మరియు రక్షణ సేవ యొక్క అవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31 జూలై 1975 న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరాగాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పు పట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద ఉంచడానికి రుస్తాంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించు కున్నారు.1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలులోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు మరియు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి. కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణ దళం విధులు అధికారికంగా నిర్వచించ బడ్డాయి, దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978 న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి. ఎ. కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్ ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు, కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేర లేదు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978 న భారత పార్లమెంట్ యొక్క కోస్ట్ గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించ బడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీ చట్టం కలిగి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది.



సంగనబట్ల
9440595494

# మహిళ వైద్యులు : సవాళ్ళు

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్: ఎలిజబెత్ బ్లాక్‌వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం



(నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే)" జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్య రంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎం దరో మన ముందు ఉన్నారు.

**వైద్య రంగంలో లింగ అసమానతలు**

జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగ వేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటి తరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు.

**భారతదేశంలో మహిళా వైద్యులు**

భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకలుగా ఎదిగారు. ప్రస్తుతం MBBS విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60 శాతం), గైనకాలజీ (60 శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యులు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. భారతదేశంలోని మహిళా వైద్యులు నేడు తీవ్రమైన వృత్తి–కుటుంబ సంఘర్షణ, లింగ పక్షపాతం, పరిమిత కార్యాలయ అభద్రత, వివక్షత, వేధింపులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వైద్యులకు వృత్తి–వ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువ బిడ్డలు, బాలికలను వైద్య రంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్య రంగ ప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం రోజు మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగుల సహాయ పడదం, స్నేహి తుల ప్రోత్సాహం అందిండం, కుటుంబ సభ్యుల చేయూత, ఇతర వైద్యుల సహ కారం, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యం అని భావిద్దాం.



డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జాతీయం-అంతర్జాతీయం

## బీజేపీ ఐటీ సెల్‌లా ఎన్నికల కమిషనర్



**కోల్‌కతా, ఫిబ్రవరి 2 :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌తో గంటన్నర పాటు సమావేశమైన అనంతరం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్రదాడికి దిగారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కింద భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని, ఎన్నికల సంఘం బీజేపీ ఆదేశాల మేరకు పని చేస్తోందని ఆరోపించారు. సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత, విలేకరులతో మాట్లాడుతూ, బెంగాల్‌లో సర్వసాధారణమైన చిన్న చిన్న స్పెల్లింగ్ తేడాలు, పేర్లలో మార్పుల కారణంగా ఓటర్ల దరఖాస్తులను రద్దు చేస్తున్నారని మమత ఆరోపించారు. వారు ముందుగా ప్రజల పేర్లను తొలగించారు. ఎన్నికల కమిషనర్ బీజేపీ ఐటీ సెల్ లాగా పనిచేస్తున్నారు. దీన్ని మీరు ప్రజాస్వామ్యం అంటారా? అని ఆమె ప్రశ్నించారు. బెనర్జీ, బంద్యోపాధ్యాయ, ముఖర్జీ, ముఖోపాధ్యాయ, లేదా చటర్జీ–చట్టోపాధ్యాయ వంటి స్పెల్లింగ్ తేడాల కారణంగా కూడా పేర్లను తొలగిస్తున్నారని బెనర్జీ అన్నారు.

బెంగాల్‌లో ఇంటిపేర్లు మారుతాయి. ప్రజలు తమ బిరుదులను మార్చుకుంటారు. బిరుదులు మారడం వల్ల పేర్లను కుదించి రాస్తున్నారు, అని ఆమె అన్నారు. ఇలాంటి తేడాలను అసాధారణతలుగా గుర్తించి ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగిస్తున్నారని ఆమె తెలిపారు. ఎలాంటి విచారణ జరపకుండానే ఏకంగా 58 లక్షల మంది ఓటర్లను తొలగించారని ఆమె ఆరోపించారు. వారు వ్యక్తులను కనీసం అడగను కూడా లేదు, అని ఆమె అన్నారు. ఈ ప్రక్రియ సమయంలో బూత్ స్థాయి అధికారుల (బిఎల్ఓ)లపై ఒత్తిడి పెడుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒత్తిడి అంతా బిఎల్ఓలపైనే ఉందని అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీలు అసమాన రీతిలో ప్రభావితమవుతున్నారని బెనర్జీ ఆరోపించారు. ఎస్సీలను, మైనారిటీలను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? వారు మనుషులు కాదా? అని ఆమె ప్రశ్నించారు.

### బీజేపీ పాలిత అస్సాంలో ఎస్ఐఆర్ ఎందుకు లేదు?

ఈ సవరణ సమయాన్ని ప్రశ్నిస్తూ, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారని బెనర్జీ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఈ తొందర ఎందుకు? ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలను మీరు వదిలిపెట్టి ఉండాల్సింది, అని ఆమె అన్నారు. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని కూడా ఆమె ఆరోపించారు. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం ఉంది, అందుకే మీరు అక్కడ ఎస్ఐఆర్‌ను చేపట్టలేదు. మీరు బెంగాల్, కేరళ, తమిళనాడులను లక్ష్యంగా చేసుకుని, బీజేపీ పాలిత రాష్ట్రాన్ని వదిలేస్తున్నారు," అని ఆమె విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు భూరికార్డులు, మాధ్యమిక సర్టిఫికెట్ల వంటి పత్రాలను ఉపయోగించడానికి అనుమతి ఇచ్చినప్పటికీ, బెంగాల్ కోసం నిబంధనలను మార్చారని బెనర్జీ ఆరోపించారు. తన దాడిని తీవ్రతరం చేస్తూ, ఇది ఎన్నికల సంఘం కాదు. ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్ కాదు. ఇది ఒక బీజేపీ ఏజెంట్. కేవలం ఒక ఏజెంట్ అని ఆమె ఘాటుగా విమర్శలు చేశారు.

### అవమానించారు, శుద్ధ అబద్ధాలను అంటగట్టారు..

తాను చివరికి సమావేశం నుంచి బయటకు వచ్చానని బెనర్జీ అన్నారు. నేను సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చాను. ఈ ఎన్నికల కమిషనర్ చాలా అహంకారి. మాతో దురుసుగా ప్రవర్తించారు. మమ్మల్ని అవమానించారు, అని ఆమె ఆరోపించారు. న్యాయం కోసమే తమ ప్రతినిధి బృందం వచ్చిందని పేర్కొంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ మాకు అబద్ధాల చెత్తను అంటగట్టారు. మేము ఇక్కడ న్యాయం కోసం వస్తే, మాకు అన్యాయం జరిగింది అని బెనర్జీ విమర్శించారు. నకిలీ ఓటర్ల అంశాన్ని లేవనెత్తినందుకు తృణమూల్‌ను నిందించడం ద్వారా కమిషన్ ఎస్ఐఆర్‌ను సమర్థించిందని, పోల్ ప్యానెల్ సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించిందని, ఈసీఐ దగ్గర మీడియా ప్రవేశాన్ని పరిమితం చేసిందని ఆమె ఆరోపించారు. నేను ఈ రకమైన ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎప్పుడూ చూడలేదు అని బెనర్జీ అన్నారు.

### ఎస్ ఐఆర్-బాధిత కుటుంబాలతో నిరసన...

అంతకుముందు, బెనర్జీ, తృణమూల్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఎంపీ కళ్యాణ్ బెనర్జీలతో కలిసి, ఎస్ ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రభావితమైనట్లుగా చెప్తున్న 12 మంది కుటుంబ సభ్యులతో కలిసి సిఇసిని కలిశారు. ప్రతినిధి బృందం నిరసనగా నల్ల దుస్తులు ధరించింది. అధికారిక రికార్డులలో చనిపోయినట్లు ప్రకటించినా, బతికి ఉన్న వ్యక్తులు, సవరణ ప్రక్రియకు సంబంధించిన ఒత్తిడి కారణంగా మరణించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల బంధువులు వీరిలో ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఈసీఐ వెలుపల పోలీసు భద్రతను పెంచారు.

పార్లమెంటులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బెనర్జీ కూడా ప్రతిధ్వనిస్తూ, కొనసాగుతున్న వివాదం కార్యకలాపాలకు అంతరాయం కలిగించిందని అన్నారు. బిజెపి అధికారంలో కొనసాగితేనే మీ కుర్చీ ఉంటుంది. ఈ రోజు మీరు మీ కుర్చీని కాపాడుకోవచ్చు, రేపు మీరు కాపాడుకోలేరు అని ఆమె అన్నారు.

## పుస్తకంలోని మాటలే చెప్పారు..

**కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ**
**పార్లమెంటులో రాహుల్ వ్యాఖ్యల సమర్థన**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 :** మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ ఎంఎం నరావణె అప్రచురిత జ్ఞాపకాల పుస్తకం నుంచి ప్రతిపక్ష నాయకుడు, తన సోదరుడు రాహుల్ గాంధీ ఉటంకించడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ సమర్థించారు. సైన్యాన్ని అపఖ్యాతి పాలు చేశారంటూ బీజేపీ చేసిన ఆరోపణలకు స్పందిస్తూ, ఏదైనా బయటకు వచ్చి, తాము దాక్కోవాలని అనుకున్నప్పుడు వాళ్లెప్పుడూ ఇలాగే మాట్లాడతారని ప్రియాంక అన్నారు.

అతడు సైన్యాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకు యత్నించడం లేదు. మాజీ సైన్యాధ్యక్షుడి పుస్తకంలోనుంచి చదువుతున్నాడు అంతే. తమ విషయాలు ఏవైనా వెలుగులోకి వచ్చి, తాము దాక్కోవాలనుకున్నప్పుడు బీజేపీ ఇలాగే మాట్లాడుతుందని ఆమె పార్లమెంటులో గందరగోళం అనంతరం వ్యాఖ్యానించారు. మాజీ సైన్యాధ్యక్షుడు మనోనరావణె అప్రచురిత గ్రంథం నుంచి కొన్ని అంశాలను రాహుల్ చదివేందుకు యత్నిస్తున్నప్పుడు సభలో గందరగోళం చెలరేగింది. రక్షణమంత్రి రాజనాథ్ సింగ్, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, హోం మంత్రి అమిత్ షాలు అతడి ప్రసంగానికి అంతరాయం కలిగించేందుకు యత్నించారు. గత రెండు గంటల్లో పార్లమెంట్ మూడవసారి సమావేశమైనప్పుడు, మాజీ ఆర్మీ చీఫ్ నరావణే ప్రచురించని జ్ఞాపకాలపై ప్రతిపక్ష నాయకుడు మరోసారి తన వాదనలపై గట్టిగా నిలబడటంతో, లోక్‌సభ చివరికి సోమవారానికి వాయిదా పడింది.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సైన్యాధ్యక్షుడు రాసిన వివరాలలోని విషయాలకు ప్రభుత్వం అడ్డుపడుతున్నందువల్లే తనను మాట్లాడకుండా అడ్డుకుంటోందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమస్య కేవలం భూభాగం గురించే కాదని, భారత్–చైనా ప్రతిష్టంభన సమయంలో నాయకత్వం, జవాబుదారీతనం గురించినదని ఆయన అన్నారు. ఇది తన అభిప్రాయం కాదని.. మాజీ సైన్యాధ్యక్షుడు రాసిందని, ఆయన దృక్కోణానికి వారు ఎందుకు భయపడుతున్నారు? అని గాంధీ ప్రశ్నించారు. చైనాకు వ్యతిరేకంగా నిలబడటంలో రాజకీయ నాయకత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.

### ప్రభుత్వం అతిగా స్పందించింది

**సభలో పరిణామాలపై థరూర్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 :** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా, ఇంకా ప్రచురితం కాని మాజీ సైన్యాధ్యక్షుడు నరావణే జ్ఞాపకాల నుంచి ఉటంకించడానికి రాహుల్ గాంధీ యత్నించడం, పదేపదే సభ వాయిదా పడడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మద్దతు ప్రకటించారు. పార్లమెంటు బయట విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం అతిగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ప్రజల మధ్య ఉన్న ఒక అంశాన్ని రాహుల్ గాంధీ లేవనెత్తారన్నారు. రాహుల్ గాంధీ కారవాన్ పత్రికలో ప్రచురితమైన వ్యాసాన్ని ఉటంకించారు. అందులో ఇంకా విడుదల చేయని పుస్తకంలోని కొన్ని అంశాలను ప్రస్తావించారని వివరించారు. ప్రచురితమైన ఒక వ్యాసం ఆధారంగా రాహుల్ ప్రశ్నించాలని అనుకొని ఉండవచ్చు, కానీ పుస్తకం ప్రచురితం కాలేదని అడ్డుపడకుండా, ప్రభుత్వం అతడిని మాట్లాడనివ్వాల్సిందని ఆయన అన్నారు. ఆ పత్రిక అందుబాటులో ఉందని ఎవరైనా దానిని చదవవచ్చని అంటూ, వ్యక్తిగతంగా తాను కూడా ఆ వ్యాసాన్ని చదివానన్నారు.

సున్నితమైన జాతీయ భద్రతా సమస్యల గురించి చర్చను అనుమతించడానికి, ముఖ్యంగా చైనా పై చర్చించడానికి ప్రభుత్వం విముఖంగా ఎందుకుంటుందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం అటువంటి చర్చకు ఎందుకు భయపడుతోంది? ఈ చైనా వ్యవహారం దేశానికి ఆందోళన కలిగించే విషయం. విదేశీ మంత్రి, రక్షణ మంత్రితో పార్లమెంటులో చర్చ జరపాలని, ఏం జరుగుతోందో చెప్పాలని అంటూ, చర్చను అణచివేయడం అన్నది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదని హెచ్చరించారు. ఆ వ్యాసం సాయుధ దళాలను, సైనికులను ఏ రకంగానూ నిందించలేదని ఆయన స్పష్టం చేశారు.

## రైల్వే ప్రాజెక్టుల్లో తెలంగాణకు విశేష ప్రాధాన్యత

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (పిఐబి) :**



తెలంగాణలో రైల్వే వ్యవస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం, రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి, కొత్త రైళ్ల కేటాయింపు కోసం భారీగా నిధులను మంజూరు చేస్తోంది. దీంతో గత 11 ఏళ్లలో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు భారీగా అభివృద్ధి చెందాయని, రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

### భారీగా పెరిగిన బడ్జెట్ కేటాయింపు..

తెలంగాణకు సగటు వార్షిక రైల్వే బడ్జెట్ కేటాయింపు భారీగా పెరిగింది. 2009–14 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రానికి కలిపి వార్షిక సగటు బడ్జెట్ రూ.886 కోట్లు అందగా, 2026–27లో ఆరు రెట్లు పెరిగి రూ.5,454 కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగింది. 2014–15 రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.258 కోట్ల కేటాయింపు జరగగా, 2026–27 బడ్జెట్‌లో దాదాపు 20 రెట్లు అధికంగా(రూ.5,454 కోట్లు) కేటాయింపు జరిగింది.

### రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి...

తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి రైల్వే శాఖ విశేష ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.47,984 కోట్లతో చేపట్టిన రైల్వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో కొత్త ట్రాక్ నిర్మాణం, స్టేషన్ల అభివృద్ధి, రైల్వే భద్రత పెంపొందించడం వంటి అనేక పనులు ఉన్నాయి. రూ.413 కోట్ల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి కొత్త రైల్వే టర్మినల్‌ను 2025 జనవరి 5న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అలాగే, తెలంగాణలో 2014 నుంచి ఇప్పటివరకు 499 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను రైల్వే శాఖ నిర్మించింది. దీనితో పాటుగా, 1,242 కిలోమీటర్ల మేర రైల్వే భద్రత వ్యవస్థ(కవచ్)ను ఏర్పాటు చేస్తోంది.

### 40 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి...

అమృత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం రూ.2,015 కోట్లు కేటాయించింది. ఇప్పటికే బేగంపేట, కరీంనగర్, వరంగల్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పూర్తయ్యింది. మిగతా చోట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

### కొత్త రైళ్లు ప్రారంభం...

తెలంగాణకు రైలు అనుసంధానాన్ని సైతం రైల్వే శాఖ మెరుగుపరుస్తోంది. సరికొత్త సాంకేతికత, అధునాతనతో కూడిన కొత్త రైళ్లను రాష్ట్రం నుంచి నడిపిస్తోంది. ఇప్పటివరకు 5 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 3 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు తెలంగాణ నుంచి నడుస్తున్నాయి.

### 900 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్...

తెలంగాణలో 2014 నుంచి దాదాపు 900 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం జరిగింది. ఇది యూఏఈ దేశ మొత్తం రైల్వే వ్యవస్థ కంటే కూడా ఎక్కువ. మరోవైపు తెలంగాణలో 100 శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణను సైతం రైల్వే శాఖ పూర్తి చేసింది. 2014 నుంచి ఏకంగా 1,115 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల విద్యుదీకరణ పూర్తయ్యింది. తెలంగాణలో 2009–14 మధ్యకాలంలో సగటున సంవత్సరానికి 17 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ నిర్మాణం జరగగా, 2014–24 మధ్యకాలంలో సంవత్సరానికి సగటున 65 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్ నిర్మాణం జరిగింది. ఇది గతంలో పోలిస్తే 4 రెట్లు అధికం.

తెలంగాణలో 2009–14 మధ్యకాలంలో సంవత్సరానికి సగటున 41 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ విద్యుద్దీకరణ జరగగా, 2014–24 మధ్యకాలంలో 110 కిలోమీటర్ల మేర జరిగింది. ఇది గతంలో పోలిస్తే 3 రెట్లు అధికం. తెలంగాణలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా ఏపీలోని నంబూరుకు 57 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం 2024 అక్టోబర్ 24న ఆమోదం తెలిపింది. భద్రాచలం మీదుగా మల్కన్‌గిరి–పాండురంగాపురం మధ్య 173.6 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి 2024 ఆగస్టు 9న కేంద్రం ఆమోదం తెలిపింది.

## వాంగ్ చుక్‌ను సమర్థించుకున్న కేంద్రం

**ఎన్ఎస్ఎ కింద అరెస్టుపై సుప్రీం కోర్టులో సమర్థన**
**ప్రజా శాంతికి తీవ్రమైన ముప్పు అంటూ వాదన**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (వుదయం) :**

సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్టు చేయడాన్ని సోమవారం సుప్రీం కోర్టులో కేంద్రం సమర్థించుకుంది. అతడి ప్రకటనలు, జాతీయ భద్రతకు, ప్రజా శాంతికి తీవ్రమైన ముప్పును కలిగించేలా ఉన్నాయని కోర్టులో కేంద్రం వాదించింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ప్రసన్న బి వరాలేతో కూడిన ధర్మాసనం ఎదుట వాదనలు జరిగాయి. ప్లెబిసైట్, రెఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ)కు పిలుపునిస్తూ వాంగ్‌చుక్ 'విషం వెదజల్లడానికి' అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ముఖ్యంగా లడఖ్ వంటి వ్యూహాత్మకంగా సున్నితమైన ప్రాంతంలో ఇలాంటివి అనుమతించలేమని, ఈ ప్రాంతం దేశ రక్షణకు, సరిహద్దులో మోహరించిన బలగాలకు సరఫరా లంకె విషయంలో అత్యంత కీలకమైనదని ఆయన పేర్కొన్నారు.

అటువంటి ప్రాంతాన్నిస్తంభింపచేయడాన్ని, నివారించాలని ఆయన నొక్కి చెప్పారు. వాంగ్‌చుక్ చేసిన ప్రకటనలను కేంద్రం ప్రశ్నించింది. ప్రతి ప్రాంతానికి తాను ఏ దేశానికి చెందిందో నిర్ణయించుకునే హక్కు ఉందని ఆయన చేసిన ప్రకటనలలో పేర్కొంటూ, రిఫరెండం, ప్లెబిసైట్ కోసం వాదించాడని, ఇలాంటి వ్యాఖ్యలు జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించడానికి తగిన కేసుగా పరిగణించబడవా అని మెహతా ప్రశ్నించారు. లడఖ ప్రాంతం నేపాల్, బాంగ్లాదేశ్‌లలా తయారవ్వాలని వాంగ్‌చుక్ కోరుకుంటున్నారా అని ప్రశ్నిస్తూ, కేంద్రం అతడిని అరెస్టు చేయడాన్ని సమర్థించుకుంది. వాంగ్‌చుక్ యువతను ఆత్మాహుతికి పురికొల్పుతున్నారని కూడా సొలిసిటర్ జనరల్ ఆరోపించారు. అతడు, ప్రజాభిప్రాయ సేకరణకు, రెఫరెండంకు పిలుపునిస్తున్నాడు," అని కోర్టుకు తెలియజేస్తూ, ఇటువంటి చర్యలను అనుమతించలేమని కేంద్రం వాదించింది. సాయుధ దళాల గురించి వాంగ్‌చుక్ వ్యాఖ్యలను ప్రశ్నిస్తూ, అతడు చుట్టూ పాకిస్తాన్, చైనా భద్రతా దళాలు ఉన్న చోట కూర్చుని, భారతీయ సైన్యం బలహీనమైనదంటాడా అని కేంద్రం ప్రశ్నించింది. అటువంటి ప్రకటనలు అత్యంత అభ్యంతరకరమని కేంద్రం పేర్కొంది.

అలాగే, లడఖ్‌ను సీతా మాతతో పోలుస్తూ వాంగ్‌చుక్ ఉపయోగించిన ఉపమానం అభ్యంతరకరమన్నారు. రాముడు ఆమెను రావణుడి నుండి రక్షించినప్పటికీ, ఆ తర్వాత ఆమెను సంతలో పెద్ద వ్యాపారవేత్తలకు అమ్మకానికి పెట్టారని ఆయన అన్నట్టు వచ్చిన ఆరోపణలు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అటువంటి పోలిక ఆమోదయోగ్యం కాదని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, వాంగ్‌చుక్ విషాన్ని వ్యాప్తి చేయడాన్ని అనుమతించలేమని సుప్రీం కోర్టుకు నివేదిస్తూ, అతడి ప్రకటనలు, చర్యలు ఎన్ఎస్ఎ కింద అతడిని అరెస్టు చేసేందుకు తగిన కారణాలని అన్నారు. లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ హోదా అన్న డిమాండ్లపై 2025 సెప్టెంబర్‌లో లేహ్‌లో నిరసనలు చెలరేగడంతో వాంగ్‌చుక్‌ను ఎన్ఎస్ఎ కింద నిర్బంధించి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉంచారు.

అరబ్ స్ప్రింగ్ తరహాలో ప్రభుత్వాన్ని కూలదోయడం గురించి తాను ఎప్పుడూ ఎలాంటి ప్రకటన చేయలేదని, ప్రభుత్వాన్ని విమర్శించడానికి, నిరసన తెలియజేయడానికి తనకు ప్రజాస్వామ్య హక్కు ఉందంటూ జనవరి 29న వాంగ్‌చుక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనను నిర్బంధించడాన్ని సమర్థించేంతగా తాను ప్రకటనలు చేయలేదని, తాను వ్యక్తం చేసిన అభిప్రాయాలు రాష్ట్ర భద్రతకు ఎటువంటి ముప్పు కలిగించవని స్పష్టం చేశారు.

వాంగ్‌చుక్ భార్య ఆంగ్మో తరుపున వాదిస్తూ సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కలుషిత నీటి కారణంగా కడుపులో సమస్యల గురించి వాంగ్‌చుక్ ఫిర్యాదు చేయడంతో, అతడిని నిపుణుల చేత పరీక్ష చేయించమని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. వాంగ్‌చుక్ సరిహద్దు వద్ద ప్రజలను రెచ్చగొట్టాడనే ఏజెన్సీ ఆరోపణ పూర్తిగా నిరాధారమని సిబల్ వాదించారు, మహాత్మా గాంధీ చూపించిన విధంగా ఆయన ఎల్లప్పుడూ నిరాహార దీక్షలు, పాదయాత్రల శాంతి యుత మార్గాన్ని అనుసరిస్తారని పేర్కొన్నారు.

## పాకిస్తాన్ మమ్మల్ని ఎదుర్కోలేదు

**బలూచ్ మహిళా ఫిదాయీన్**
**వీడియోను విడుదల చేసిన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ**



**బలూచిస్తాన్ :** ఇటీవలి సంవత్సరాలలో నిర్వహించిన అత్యంత దారుణమైన ఆపరేషన్లలో ఒకటైన దాడిలో పాల్గొన్న మహిళా 'ఫిదాయీన్' (ఆత్మాహుతి దళ సభ్యురాలు) వీడియోను తిరుగుబాటు గ్రూపు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ విడుదల చేసింది. వారాంతంలో, పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ వీడియోలో, హవా బలోచ్‌గా గుర్తించిన ఆత్మాహుతి దాడి సభ్యురాలు పాకిస్తానీ భద్రతా సిబ్బందిపై కాల్పులు జరపడం కనిపించింది. గ్వాదర్ లో బిఎల్ఎ నిర్వహిస్తున్న ఆపరేషన్ హెరాఫ్ రెండవ దశలో వారు పాల్గొంటున్నారు. ఆపరేషన్ హెరాఫ్‌లో ఆత్మాహుతి దళ సభ్యురాలు 'ఫిదాయీన్' బలూచ్, తోటి 'ఫిదాయీన్ లతో కలిసి నిస్వార్థంగా పోరాడారు. తన మరణానికి పన్నెండు గంటల ముందు ఆమె పంపిన సందేశమిది అంటూ తిరుగుబాటు గ్రూపు వీడియోతో పాటు పంపిన సందేశంలో పేర్కొంది. అర్థరాత్రి లేదా తెల్లవారుజామున ఫోన్ కెమెరాతో తీసిన వీడియోలా అనిపిస్తున్న ఆ వీడియోలో బలూచ్ జీవితంలోని ఆఖరు గంటలలో పాకిస్తానీ దళాలతో పోరాడటాన్ని నమోదు చేసింది. బలూచ్ జాతీయులారా, నేడు మీ సోదరీమణులలో ఒకరు పంజాబీ సైన్యాన్ని ఎదుర్కొంటోంది. ఇప్పుడు మీరు కూడా ధైర్యం చేసి ముందుకు రావాలి. మనకు మరో మార్గం లేదని, బలూచ్ ఆ వీడియోలో అనడం రికార్డు అయింది.

భయంతో పాకిస్తాన్ ముందుకు రావడం లేదు. పాకిస్తాన్ మనను ఎదుర్కోలేదు. నేడు ఎంతో సంతోషకరమైన రోజు. నేడు మనం శత్రువును ఎదుర్కొంటున్నాం. శత్రువుకు బలోచ్ తల్లులను, అక్కచెల్లెళ్లను వదిలేయమని చూపిస్తామని అన్నారు. ఆమె ఎరుపు, నీలం కుర్తాను ధరించి, బిఎల్ఎ లోగో ఉన్న బేస్ బాల్ క్యాప్‌ను ధరించారు. యుద్ధం ఎలా ఉంది అని మరొక ఫిదాయీ ప్రశ్నించినప్పుడు, యుద్ధం సరదాగా ఉందంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చారు. గ్వాదర్ ఫ్రంట్ వద్ద ఉన్న పాకిస్తానీ భద్రతా సిబ్బందిని మన అటాకర్ల బృందం చంపివేసిందని ఆమె పేర్కొన్నారు. నేడు శత్రువులు శోకంతో ఉన్నారని, ఎక్కడ చూసినా వారి ఏడుపులు, శోకాలూ వినిపిస్తున్నాయని, అణచివేతకు గురైన మన తల్లులు, అక్కచెల్లెళ్లపై మాత్రమే తమ శక్తిని వారు చూపించగలరని అన్నారు. వారు మనల్ని ప్రత్యక్షంగా ఎదుర్కొనలేరు. అది వారి సామర్థ్యాలకు ఆవల ఉన్నది, అని ఆమె అన్నారు. బలోచ్ జాతి మేల్కొనాలని కోరారు. మీడియా నివేదికల ప్రకారం, హవా బలోచ్ జెన్ జీ మహిళ. ఆమె తండ్రి 2021లో పాకిస్తానీ భద్రతా దళాల చేతిలో మరణించిన బిఎల్ఎ యోధుడు. తిరుగుబాటులో చేరడానికి ముందు ఆమె అధికారిక విద్యను అందుకున్నట్టు తెలుస్తోంది. ఇది దశాబ్దాలుగా సాగుతున్న బలూచ్ వేర్పాటువాద ఉద్యమంలో పెరుగుతున్న యువ, విద్యావంతులైన యువత చేరుతున్న ధోరణిని ప్రతిబింబిస్తుంది.

### మరణించిన బిఎల్ఎ తిరుగుబాటుదారులు...

గత శనివారం నాడు దాదాపు 92మంది వేర్పాటువాద కార్యకర్తలను హతమార్చామని, బిఎల్ఎ దళాలపై జరిగిన కౌంటర్ ఆపరేషన్‌లో శుక్రవారం నాడు 41మందిని చంపినట్టు పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. కాగా, ఆపరేషన్ సందర్భంగా మజీద్ బ్రిగేడ్‌కు చెందిన 11మంది ఫిదాయీ (ఆత్మాహుతి దళం) సహా 18మంది ఫైటర్లను చంపివేసిందని బిఎల్ఎ కూడా అంగకరించింది. వీరిలో ఫతే స్క్వాడ్‌కు చెందిన నలుగురు యోధులు, ఎస్‌టిఓఎస్ యూనిట్‌కు చెందిన ముగ్గురు మరణించినట్టు అంగీకరించింది.

పాకిస్తాన్‌లో అతిపెద్ద భూభాగమైన బలూచిస్తాన్‌లో జనాభా అతిస్వల్పం. కానీ, రాజకీయ అణచివేత, సహజ వనరుల నియంత్రణపై వివాదాల కారణంగా ఎక్కువ స్వయంప్రతిపత్తినీ, స్వాతంత్ర్యాన్ని కోరుతూ వేర్పాటువాద గ్రూపుల నేతృత్వంలో చాలా కాలంగా తిరుగుబాటు జరుగుతోంది. ఈ గ్రూపులలో అత్యంత ప్రముఖమైంది బిఎల్ఎ. దీనిని తీవ్రవాద సంస్థగా పాకిస్తాన్, అనేక ఇతర దేశాలూ గుర్తించాయి. బిఎల్ఎను అణచివేసేందుకు పాక్ సైన్యం యత్నిస్తున్నప్పటికీ, బలూచ్ తిరుగుబాటుదారులకు పౌరుల మద్దతు అందిస్తున్నారు.

## 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026'

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (వుదయం) :**




కేంద్ర బడ్జెటుపై దేశ యువతీయువకుల్లో అవగాహనను పెంపొందించడంతో పాటు, బడ్జెటులో చేసిన కేటాయింపుల్ని మరింత ఎక్కువ మంది అర్థం చేసుకోవడం కోసం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ – 2026'ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ సోమవారం ప్రారంభించారు. కళాశాలలు, సంస్థలు, శిక్షణ కేంద్రాల్లోని యువతను నిర్దిష్ట ప్రాతినిధ్య ప్రణాళిక ద్వారా భాగస్తుల్ని చేసి, పౌరులు తమ నిత్య జీవితంలో 2026 కేంద్ర బడ్జెటుకు ఉన్న ప్రాధాన్యాన్ని గ్రహించేలా చూడాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ పోటీ రేపటి నుంచి, అంటే 2026 ఫిబ్రవరి 3 నుంచి మై భారత్ వేదిక (https://mybharat.gov.in/)లో మొదలవుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇది 2026 కేంద్ర బడ్జెటుకు సంబంధించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్. మై భారత్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న యువతీయువకులు దీనిలో పాల్గొనవచ్చు. ఈ క్విజ్‌లో పాల్గొనడానికి ఫిబ్రవరి 17 ఆఖరి గడువుతేదీ. దీని తరువాత, ప్రతి ఒక్క రాష్ట్రంలో, కేంద్రపాలిత ప్రాంతంలో అగ్రగాములుగా నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. వారు ఫిబ్రవరి 17 నుంచి 2026 మార్చి 3 వరకు రెండో విడత పోటీలో పాల్గొంటారు.

ఈ విడతలో వ్యాసరచన పోటీని నిర్వహిస్తారు. వికసిత్ భారత్ దార్శనికతకి అనుగుణంగా కేంద్ర బడ్జెటులోని 8 అంశాలను దీనిలో భాగంగా యువతకు సూచిస్తారు. పోటీలో పాల్గొనేవారు తమ అభిప్రాయాల్నీ, ఆలోచనల్నీ వ్యాసాల రూపంలో వెల్లడిస్తారు.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)లో యువత వ్యక్తం చేసిన కొత్త కొత్త ఆలోచనల్ని ఆర్థిక మంత్రి ఈ సంవత్సర బడ్జెటు ప్రసంగంలో అందించడంతో పాటు, వాటిలో నుంచి కొన్ని ఆలోచనల్ని 2026–27 కేంద్ర బడ్జెటులో ప్రస్తావించారు'' అని కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్‌ను నిర్వహించి, ఈ భావనను ముందుకు తీసుకుపోయి, యువ వాణికి మరింత సాధికారితను అందించాలని మేం కోరుకుంటున్నాం' అని కూడా ఆయన వివరించారు. వ్యాసాల మూల్యాంకనాన్ని 2026 మార్చి 3 మొదలు అదే నెల 10 మధ్య చేపడుతారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా ప్రతిభావంతుల జాబితాల్ని 2026 మార్చి 10న ప్రకటిస్తారు.

రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల విజేతలు ఆ తరువాత వికసిత్ భారత్ దార్శనికత అన్న అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్ మాధ్యమం ద్వారా ఏర్పాటు చేసే ఒక సంభాషణ కార్యక్రమంలో పాలుపంచుకొంటారు. జాతీయ ఆర్థిక పరిణామాలు, అభివృద్ధి ప్రాధాన్యాలకు సంబంధించిన విషయాలపై యువతలో అవగాహననీ, యువత ప్రాతినిధ్యాన్నీ పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ కార్యక్రమ నిర్వహణ పునరుద్ఘాటిస్తున్నది.



# వైభవంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

**ఖానాపురం, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి):**
మండలంలోని ధర్మారావుపేట గ్రామ శివారులోని శ్రీ స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ పగడాల వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవంను ఆలయ అర్చక స్వామి అన్వేష్ శాస్త్రి అంగరంగ వైభవంగా స్వామి కళ్యాణం నిర్వహిస్తుండగా భక్తులు పరవశించిపోయారు. శ్రీ పగడాల వెంకటేశ్వరస్వామి 5వ వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్వామి కళ్యాణంలో పాల్గొని కళ్యాణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, గ్రామ సర్పంచ్ ఆలయ నిర్మాణకర్త మాద్రాజు వెంకన్నరేణుక దంపతులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 02(వుదయం జిల్లా ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి పలుగుల, మద్దులపల్లి, చంద్రుపల్లి, అన్నారం, గ్రామాల మీదుగా చెన్నూరుకు ప్రతిరోజూ మూడు ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఆయా గ్రామాల సర్పంచులు సోమవారం మంచిర్యాల జిల్లా ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలతను కలిసి వినతిపత్రం సమర్పించారు.గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం అత్యంత అవసరమైందని, విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత సానుకూలంగా స్పందిస్తూ, విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు .ఈ కార్యక్రమంలో పలుగుల సర్పంచ్ విజయలక్ష్మి, మద్దులపల్లి సర్పంచ్ సరిత, చంద్రుపల్లి సర్పంచ్ గురుసింగ బాపు, అన్నారం సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వెంటనే చేపట్టాలి



**ఖమ్మం, బ్యూరో ఫిబ్రవరి - 2(వుదయం):**
ప్రజల దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యత నిచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామం నుండి డి. సుజాత ఉపాధి కొరకు స్వీపర్ పోస్ట్ ఇప్పించగలందులకు దరఖాస్తు చేయగా, జిల్లా ఉపాధికల్పన అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామం నుండి గ్రామస్థులు, గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణ కాకుండా చర్యలకు దరఖాస్తు సమర్పించగా, స్థానిక పంపింగ్ వెల్ రోడ్ నుండి పిడకల రాంబాయి, తనకు ఇల్లు లేదని, డబల్ బెడ్ రూం ఇల్లు కేటాయించుటకు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.వైరా పట్టణం నుండి ఎస్కె. గాలిబి, తనకు స్థలం ఉందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామం నుండి పి. వెంకటమ్మ, తన భర్త ఎల్లయ్య జూన్, 2023 లో మరణించారని, తనకు ప్రభుత్వం నుండి వితంతు పెన్షన్ మంజూరుకు దరఖాస్తు సమర్పించగా, డిఆర్డీవో కు తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.అనంతరం వివిధ శాఖల్లో పనిచేసి 31 జనవరి న పదవీ విరమణ చెందిన 7 గురు అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సన్మానించి, వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నా రు

# బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరికలు



**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మధిర,ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి):**
మున్సిపల్ ఎన్నికల వేళ పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు. మధిర మున్సిపాలిటీలోని మడుపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ రేగళ్ల సాంబశివరావు,మాజీ కౌన్సిలర్ తొగరు వరలక్ష్మి,బిఆర్ఎస్ నాయకులు తోగరు ఓంకార్,పారుపల్లి వీరభద్రరావు,తలారి శేఖర్ బాబు, పంబి సాంబశివరావు,నీలం అప్పారావు,మేడికొండ ఆంథోనీ, పగడాల వెంకటేశ్వరరావు, వేల్పుల మంగయ్య,తదితరులు డిప్యూటీ సీఎం మల్లు మట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తోనే మధిర అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు.

# మండలాల అభివృద్ధిపై కేంద్ర ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్**



**మహబూబాబాద్, ఫిబ్రవరి 02 (వుదయం ప్రతినిధి) :**
సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్, అధ్యక్షతన గంగారం బ్లాక్ (ఆకాంక్షిత మండలం) సమావేశం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ప్రభుత్వ బ్లాక్ ప్రత్యేక అధికారి టి.కిరణ్ రెడ్డి, ఐఆర్ఎస్ హాజరై మాట్లాడుతూ హెల్త్, ఎడ్యుకేషన్,న్యూట్రిషన్, సానిటేషన్ లపై క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు,అభివృద్ధి అమలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు, అధికారులు చేపట్టే కార్యక్రమాలు మండల పరిధిలోని (12) గ్రామపంచాయతీల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (2) ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు (5), హెల్త్ సబ్ సెంటర్స్ (3),స్త్రీ శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాలు (25),సామ్ కేంద్రాలు (7), మ్యామ్ కేంద్రాలు (31) ల ద్వారా ప్రజలకు, చిన్నపిల్లలకు గర్భిణీలకు బాలింతలకు మెరుగైన వైద్యం, సేవలు, పౌష్టిక ఆహారం, అందించాలని నిత్యం ఆరోగ్య శిబిరాలు మాతా శిశు సంరక్షణ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా సేవలు కొనసాగించాలని సూచించారు, మండల పరిధిలో మండల ప్రజా పరిషత్ స్కూల్స్ (18), జడ్.పి.హెచ్.ఎస్ (1), కేజీ బీవీ (1), ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్స్ (3) తదితర విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లలకు పక్క మెనో ప్రకారం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, ప్రభుత్వం నుండి కల్పించే అన్ని సౌకర్యాలు అందించాలని, షెడ్యూల్ ప్రకారం పిల్లలకి వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రతి విద్యార్థి యొక్క మానసిక, ఆరోగ్య, స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు యూనిక్ ఐడి రూపొందించాలన్నారు.వ్యవసాయ శాఖ రైతులకు సంబంధించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక స్థితిగతులను బట్టి ఏ పంటలు వేస్తే రైతులు అధిక దిగుబడి లాభాలలో ఉంటారని తెలుసుకొని అందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, మినిట్స్, తదితర వాణిజ్య పంటలపై దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని మౌలిక వసతులు సంపూర్ణ అభియాన్ 2.0, కార్యక్రమాలు అన్ని గ్రామాలకు టెలికాం సేవలు, రోడ్ల వసతులు, తదితర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అధికారులకు తెలిపారు.క్షేత్రస్థాయిలో అన్ని విభాగాలు తీసుకుంటున్న కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు.సమావేశం అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి గంగారం మండల క్షేత్ర పర్యటనకు వెళ్లారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, డిఆర్డిఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జెడ్పిసిఓ పురుషోత్తం, అన్ని జిల్లా విభాగాల అధికారులు, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడమే లక్ష్యం

**పెద్దంపేట గ్రామ సర్పంచ్ లావణ్య రాజేష్**

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 02(వుదయం జిల్లా ప్రతినిధి):**
గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తాననే ఉద్దేశంతోనే గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ గా ఆశీర్వదించి సర్పంచ్ గా అవకాశం కల్పించారని తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని పెద్దంపేట గ్రామ సర్పంచ్ లావణ్య రాజేష్ అన్నారు గ్రామంలోని ప్రజలు ప్రయాణించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రహించి రహదారిపై నుండి గ్రామంలోకి ప్రవేశించేందుకు మోరీపై ర్యాంపు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలతోపాటు వాహనదారులు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోరీపై ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మోరీపై ర్యాంపు లేకపోవడంతో గ్రామంలోని ప్రజలకు ప్రయాణికులకు సంబంధించి వాహన రాకపోకల ఇబ్బందినీ గమనించి ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ తన పదవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడించారు.

# దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం



**మధిర,ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి):**
కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులతో కిటకిటలాడిన ప్రాంగణం.మూడు ప్రాంతాలలో ప్రత్యేక భోజన ఏర్పాట్లు.కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఘనంగా సాగింది.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మూడు ప్రత్యేక ప్రాంతాలలో భోజనం ఏర్పాటు చేసి,క్రమబద్ధంగా అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.వర్తక సంఘం సభ్యుల సమన్వయంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు మంచిగా నిర్వహించినందుకు భక్తులు దేవాలయం నిర్వాహకులను అభినందించారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేయడమే సర్పంచ్ లక్ష్యం

**గ్రామంలో ప్రతి శుక్రవారం అంగడి ఏర్పాటుకు పాలకవర్గం ఆమోదం**
**సీసీ రోడ్లకు ఇరువైపులా మొరం పోయడం మంచినీటి లీకేజీ లేకుండా అరికట్టడం**
**గ్రామ సర్పంచ్ దాసరి రమేష్**



**ఖానాపురం, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి):**
గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే సర్పంచ్ పాలకవర్గం లక్ష్యంగా ముందుకు వెళ్తామని గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ గ్రామస్తులకు తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన పాలకవర్గంతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా సర్పంచ్ పాలకవర్గం పనిచేయాలని తెలుపుతూ, ఇకనుంచి ప్రతి శుక్రవారం గ్రామంలో అంగడి ఏర్పాటు చేయడానికి పాలకవర్గం తీర్మానం చేసినట్లు తెలుపుతూ, గ్రామంలోని మంచినీటి సమస్య లేకుండా పైపు లైన్ల లీకేజీని వెంటనే అరికట్టడం, గ్రామంలోని సిసి రోడ్లకు ఇరువైపులా మొరంపోసి ప్రజలకు ఇబ్బంది కాకుండా చేయాలని తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు పల్నాటి నిర్మల, కామిశెట్టి లక్ష్మి శాఖమూరి ముఖేష్, గుండ్లపల్లి విజయ్, వేములపల్లి వెంకటప్రసాదరావు, చలికంటి మల్లికార్జున్, భూక్య స్రవంతి, ఈలపొంగు కొమురమ్మ, ఎస్.కె అరిఫా, తోటకూరి సంధ్య, ఎండి ఆజహార్, గుండ్లపల్లి మంజుల, పంచాయతీ కార్యదర్శి సట్ల సుప్రజ, జూనియర్ అసిస్టెంట్ రాములు, బిల్ కలెక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉంది



- **సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్**

**దమ్మపేట ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి ):**
పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మికులు పేదలు రైతులు వ్యవసాయ కూలీలు ఇతర సామాజిక తరగతులకు సంబంధించి ఉన్న అన్ని సంక్షేమ పథకాలకు కేటాయింపులు తగ్గించి పారిశ్రామికవేత్తలకు లాభాలు కట్టబెట్టే విధంగా బడ్జెట్ ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. సోమవారం జిసిసి వర్కర్స్ యూనియన్ సమావేశం రమేష్ అధ్యక్షతన జిసిసి గోడౌన్ లో జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత ఉపాధి కల్పన కనీస వేతనాలు పెంపు , అసంఘటితరంగా కార్మికులకు స్కీం వర్కర్లైన ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజనం వర్కర్లకు పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ లాంటి వాటి అమలుపై ప్రస్తావనలేదని విమర్శించారు. కార్మిక వర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్ ల రద్దుకై కనీస వేతనం రూ 26 వేల డిమాండు స్కీం వర్కర్లను కార్మికులకు గుర్తించాలన్న డిమాండ్ అసంఘటితరంగా కార్మికుల సంక్షేమ బోర్డు వంటి అంశాలను ఈ బడ్జెట్లో బిజెపి ప్రభుత్వం ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్యని అన్నారు. లేబర్ కోడ్ అమలు వల్ల నష్టపోయే కార్మికుల గురించి పట్టించుకోలేదని ఈ బడ్జెట్ అసమానతల్ని పెంచేదిగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, ఏసు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మల ఎంపికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**జగిత్యాల ఫిబ్రవరి 02 (వుదయం ప్రతినిధి):**
మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు సోమవారం హైదరాబాద్ నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపికలో ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి రాజ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తిగా అమలులో ఉండాలని నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లకు ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే సమాచారం అందించాలని పోలింగ్ లెక్కింపు ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సూచించారు పరోక్ష విధానం ద్వారా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు ఎమ్మెల్సీలు రాజ్యసభ సభ్యులు ఎక్స్ అఫిషియో హోదాలో ఏదో ఒక మున్సిపాలిటీని ఎంచుకొని ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు సెక్షన్ 5, 20 ప్రకారం ఎవరైనా ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీలు తాము ఎన్నికైన 30 రోజుల్లోపు ఏదో ఒక మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించేందుకు ఆప్షన్ ఇచ్చి ఉండాలని అలా కాకుండా ఇంత వరకు ఆప్షన్ ఇవ్వని పక్షంలో నిబంధన ప్రకారం మున్సిపల్ ఎన్నికలు అయిన 30 రోజుల్లో ఆప్షన్ ను సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు దీనికొరకు ఫిబ్రవరి 11 నుండి 14వ తేదీ లోపు నోటీస్ జారి చేసి ప్రజాప్రతినిధుల నుండి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు అనంతరం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించి రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు పోలింగ్ కౌంటింగ్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయాల్లో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని అందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు ఎన్నికల నిబంధనల మేరకు ఫిబ్రవరి 11 నుండి 14వ తేదీ లోపు నోటీసులు జారీ చేసి ఆప్షన్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేల అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు



# బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హనుమకొండ, ఫిబ్రవరి 02 (వుదయం ప్రతినిధి) :**
బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. పోలీస్ కమిషనరేట్ లో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ సబ్ ఇన్స్ స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తూ సివిల్ ఎస్సైలుగా పదోన్నతి పొందిన వేణుగోపాల్ రెడ్డి, రాజేందర్, పర్వీన్ లు సోమవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అప్పగించిన పనులను సమర్ధవంతంగా పనిచేస్తూ బాధితులకు న్యాయం చేయాలని సీపీ పేర్కొన్నారు

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**గ్రామస్తుల ఆర్థిక సహాయంను మృతుని కుటుంబానికి అందజేసిన సర్పంచ్ రమేష్**



**ఖానాపురం, ఫిబ్రవరి 2 (వుదయం ప్రతినిధి):**
మండల కేంద్రానికి చెందిన హోటల్ తూనం శంకర్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా మృతిని కుటుంబానికి గ్రామస్తుల యువకుల తరపున వచ్చిన విరాళాలు లక్ష ఎనిమిది వేల ఒక రూపాయి మృతుని కుటుంబానికి గ్రామస్తులతో యువకులతో కలిసి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, ఎండి అజహర్, గ్రామస్తులు యువకులు వడ్డే రాజశేఖర్, జాకీర్ హుస్సేన్, డెంకల వెంకటేశ్వర్లు, మచ్చిక అశోక్, గంగాపురం రమేష్, ముడుసు రమేష్,వడ్డే వెంకటేష్, మర్రి రామస్వామి, బోడ దేవా, తరాల నరేష్, ప్రశాంత్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హనుమకొండ, ఫిబ్రవరి 02 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను నిర్ణీత గడువులో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజలు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యలను వివరించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సీరియస్ గా పరిగణించి పక్షం రోజుల్లోగా తీసుకున్న చర్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలను డీఆర్ఓకు అందజేయాలని అధికారులను సూచించారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హాస్టల్స్ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు - అధ్యాపకుల పనితీరు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని తెలిపారు.అలాగే హాస్టల్స్ లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలను పరిశీలించి, అందులో వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. హాస్టల్స్ లో శుద్ధమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.




# కరాటేలో గోల్డ్ మెడల్స్ సాధించిన బొర్రా సాత్విక,సుశాంత్

**దమ్మపేట,ఫిబ్రవరి 02 (వుదయం ప్రతినిధి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామవాసి ఖమ్మం అసిస్టెంట్ లైన్మెన్ గా పనిచేస్తున్న బొర్రా ప్రసాద్, మహాలక్ష్మి దంపతులకు 12 సంవత్సరాల వయస్సు గల బొర్రా సాత్విక అనేఆరోవ తరగతి చదువుతున్న కుమార్తె, 10 సంవత్సరాలు వయస్సు గల బొర్రా సుశాంత్ అనే ఐదోవ తరగతి చదువుతున్న కుమారుడు . వీరు ఇరువురు ఖమ్మం బిబిఎం హై స్కూల్ లో చదువుతూ అతి చిన్న వయస్సులోనే కరాటేలో ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన వరంగల్ లో పోచమ్మ గుడి వద్ద ఫంక్షన్ హల్ లో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ లో ఇద్దరు పిల్లలు బాలుర, బాలికల విభాగాలలో గోల్డ్ మెడల్ లు సాధించారు. జనవరి 4వ తేదీ ఖమ్మంలో న్యూ విజన్ స్కూల్ లో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ లో ఇద్దరూ గోల్డ్ మెడల్ లు సాధించారు. 2025వ సం. ఫిబ్రవరి 02వ తేదీన ఖమ్మం వర్తక సంఘం భవనంలో, ఆగష్టు 03 వ తేదీ ఎం.బి గార్డెన్ లో నిర్వహించిన పోటీలలో కూడా గోల్డ్ మెడల్ లు, ట్రోఫీ లు, సర్టిఫికెట్ లు పొందిన అక్క, తమ్ముడు లకు కరాటే పోటీలలో విజయం సాధిస్తున్న తీరుకు పాఠశాల యాజమాన్యం కాంతారావు, కరాటే కోచింగ్ సి.హెచ్ రమేష్, నాగుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కందిమళ్ళ లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి సాత్విక, సుశాంత్ లకు అభినందనలు తెలియజేశారు

# ఇచ్చిన మాట మరిచారు

## ప్రైమరీ స్కూల్, అంగన్వాడి హెల్త్ సెంటర్, కట్టిస్తామని ఆనాడు మాట ఇచ్చారు



**పినపాక , ఫిబ్రవరి 2 (వుదయం ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక శ్రీరాంపురం ఎస్టి కాలనీ పసికందుల అవస్థలు మారేది ఎన్నడూ అంటూ ప్రశ్నిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముడ్వ వెంకటేశ్వర్లు( లడ్డా) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు శ్రీరాంపురం ఎస్టి కాలనీ నుండి గిరిజన చిన్నారులు చదువుకునేటందుకు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ సారపాక ప్రభుత్వ పాఠశాలకు వెళుతూ మరల రెండు కిలోమీటర్లు నడుస్తూ ఇంటికి రావాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో అంగన్వాడి కేంద్రం, ప్రైమరీ స్కూల్, లేకపోవడం వల్లనే చిన్నారులు విద్యను అభ్యసించే టందుకు అనేక రకాలుగా పాట్లు పడాల్సి వస్తుంది గతంలో శ్రీరాంపురం ఎస్టి కాలనీలో అంగన్వాడి సెంటర్, ప్రైమరీ స్కూల్, హెల్త్ సెంటర్, కట్టిచ్చే టందుకు సిపిఐ పార్టీ నుండి అనేక పోరాటాలు చేయగా ఐటీడీఏ పీవో త్వరలోనే సమస్యలు పూర్తి చేస్తామని తెలియజేసినప్పటికీ ఇప్పటివరకు అట్టి పనులను పూర్తి చెయ్యకపోవడంతో అసంతృప్తి తెలియజేస్తున్న సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ముడ్వ వెంకటేశ్వర్లు తక్షణమే శ్రీరాంపురం ఎస్టీ కాలనీ ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలను త్వరగా అందించాలని ఈ సందర్భంగా పత్రికా ప్రకటనగా తెలియజేస్తున్న ముడ్వా వెంకటేశ్వర్లు

### చిత్తడి నేలలపై

# అవగాహన కలిగి ఉండాలి




**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 2 (వుదయం ):**

చిత్తడి నేలలపై అవగాహన కలిగి ఉండాలని డీఎఫ్వో కె. అనిత అన్నారు. సోమవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట చెరువు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిత్తడి నేలలను ఎలా పరిరక్షించుకోవాలి, జీవ వైవిధ్యం, భవిష్యత్‌లో ఎటువంటి చర్యలు చేపట్టాలన్న అంశాలను వివరించారు. అనంతరం చిత్తడి నేలల్లో నివసించే పక్షిజాతుల రకాలు, ఆవాసం, వలస పక్షుల గురించి విద్యార్థులకు బైనాక్యులర్, స్పాటింగ్ స్కోప్ ద్వారా చూపిస్తూ అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎఫ్వో ఎస్. సాగరిక వెంకట్రావుపేట సర్పంచ్ ననిమేల రాజు, ఎఫ్ బి ఓ చంద్రశేఖర్, ఫారెస్ట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మరికల్ పెద్ద చెరువు నీళ్లు

# బయటికి వదలొద్దు



**మరికల్ ,ఫిబ్రవరి 2 ( వుదయం )**

మరికల్ మండల కేంద్రంలోని సోమవారం బిజెపి మండల నాయకుడు వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్ద చెరువు నీళ్లు బయటకు వదలొద్దని వేసవికాలంలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని మరియు బోరులో నీటి సోర్సెస్ లేకుంటే మరికల్ గ్రామానికి నీటి ఎద్దడి ఎక్కువ ఏర్పడుతుందని ఆయన అన్నారు రాజకీయ నాయకులు బయటికి వదులుతున్నారని ఉండు మట్టి కొట్టాలని వాళ్ళు ప్రయత్నాలు చేస్తున్నారని అందుకు తూముని మొత్తాన్ని వదిలేసి నీటి వదులుతున్నారని కోయిల్ సార్ నుండి నీటిని పెద్ద చెరువుకు నింపాలని ఆయన అన్నారు మరికల్ తహసిల్దార్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ గ్రామ సర్పంచ్ వాడి మెంబర్లు వెంటనే స్పందించి నీటిని బయటికి వదలకుండా కాపాడాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజేష్ మోహన్ రెడ్డి సూరికి వెంకటేష్ చిన్నయ్య నరేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

### ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు

# అతిక్రమిస్తే కఠిన చర్యలు



## అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ బి రాజ గౌడ్

**జగిత్యాల, ఫిబ్రవరి 02 (వుదయం )**

జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ -2010 యొక్క జిల్లా స్థాయి సమావేశం అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ బి రాజా గౌడ్ ఛాంబర్ లో జరిగింది ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ బి రాజగౌడ్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ కచ్చితంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం కంపల్సరీ అని రిజిస్ట్రేషన్ సమయంలో పొందుపరిచిన డాక్టర్స్ పారామెడికల్ స్టాఫ్ మాత్రమే సేవలు అందించాలని ఎవరైనా వెళ్ళిపోయిన కానీ కొత్తగా చేరినచో డాక్టర్లను గాని స్టాఫ్ ను గాని ఆడ్ చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయించుకోవాలని చట్టంలో పొందుపరిచిన అంశాలను అన్ని దవాఖానాలు పాటించాలని తెలిపారు అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రైవేట్ స్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రోగ్రాం ఆఫీసర్స్ కు డివిజన్ల వారిగా కొన్ని హాస్పిటల్స్ కేటాయించి ఎల్లప్పుడూ వారిని తనిఖీ చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు
ఈ కార్యక్రమంలో డిఎస్పి స్పెషల్ బ్రాంచ్ వెంకటరమణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పర్యవేక్షకులు ఖుతుబోద్దీన్ హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్ తదితరులు పాల్గొన్నారు

# మానసిక ఉల్లాసానికి క్రీడలే ప్రాణం

## రామగిరి ఎంపీడీవో శైలజ, ఎస్సై శ్రీనివాస్

- ★ ముగిసిన మండల స్థాయి సీఎం కప్ పోటీలు
- ★ విజేతలకు బహుమతుల ప్రధానం
- ★ మండలానికి మంచి పేరు తేవాలని క్రీడాకారులకు పిలుపు




**మంథని, ఫిబ్రవరి 02 (వుదయం ):**

మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని రామగిరి ఎంపీడీవో శైలజ, ఎస్సై టి. శ్రీనివాస్ పేర్కొన్నారు. మంథని జేఎన్టీయూ (JNTU) ఇంజనీరింగ్ కళాశాల వేదికగా జరిగిన రెండవ విడత సీఎం కప్ మండల స్థాయి క్రీడల బహుమతి ప్రధానోత్సవానికి వీరిరువురు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.
ఆరోగ్యం, క్రమశిక్షణకు ఆటలే మార్గం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని గెలుపుకు తొలిమెట్టుగా భావించి రెండింటిని సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడలను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం సిద్ధించడమే కాకుండా, క్రమశిక్షణ, స్నేహభావం మరియు నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. ఎంతటి మేధస్సు, ఉన్నత హోదా ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే రాణించలేమని వారు స్పష్టం చేశారు
.సాంకేతికతను నైపుణ్యం కోసం వాడాలిప్రస్తుత కాలంలో నైపుణ్యాలు పెంచుకోవడానికి యూట్యూబ్ వంటి వేదికలు అందుబాటులో ఉన్నా, యువత ఆటలపై ఆసక్తి చూపకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రామగిరి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాల్గొన్న ముఖులు సీఎం కప్ మండల ఇంచార్జి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఉమేష్,
జేఎన్టీయూ ప్రతినిధులు పింగిళి కృష్ణారెడ్డి, జి. సునీల్ కుమార్, పీఈటీ వల్లంబట్ల శ్రీనివాస్, వివిధ గ్రామ కార్యదర్శులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

### గ్రామ స్థాయిలో పార్టీ కమిటీల

# నియామకం చేపట్టాలి

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్



**వెల్దండ, ఫిబ్రవరి 2 (వు దయం )**

గ్రామ స్థాయి నుంచి పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు.అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశం కొరకై వెళ్తూ వెల్దండ గ్రామ పంచాయతీ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యం లో సోమవారం వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ ఆఫీస్ లో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కోసం కృషి చేసిన నాయకులు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతీలాల్ నాయక్ ,తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్, 2 వార్డ్ మెంబర్ రంగనాథ్ , 3 వార్డ్ మెంబర్ గుద్దటి కిష్టల్, 6 వార్డ్ మెంబర్ మారేపల్లి శ్రీను, 9 వార్డు మెంబర్ ముదికొండ రమేష్,13 వార్డు మెంబెర్ పురుషోత్తం ,అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకులు చీముల తిరుపతి రెడ్డి,ఎండీ అమీదు , కొయ్యల పుల్లయ్య,కృష్ణముదిరాజ్,ఎండి రషీద్ , రేవల్లి రాజు,దాసరి మహేష్ జంగిలి ఆనంద్ ,బొక్కల శ్రీనివాస్,భరత్ ,డేవిడ్ , రమేష్ గిందీప్,ఎండి సమీర్ తదితరులు పాల్గొన్నారు

# ఉచిత సంతానోత్పత్తి శిబిరం

## కోసునూర్ పల్లెలో పశువులకు ఉచిత సంతానోత్పత్తి శిబిరం



**ధర్మపురి, ఫిబ్రవరి 2 (వుదయం ):**

మండల పరిధిలోని కోసునూర్ పల్లె గ్రామంలో టీఎస్ఎల్డీఏ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత సంతానోత్పత్తి అవగాహన చికిత్స శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పశువులలో వంధ్యత్వ నివారణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్య క్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది.
మండల పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి,గర్భ ధారణ సమస్యలున్న పశువులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడు తూ పాడి రైతులు పశువుల పోషణలో శాస్త్రీయ మెళకువలు పాటించాలని, మేలు రకమైన సంతానోత్పత్తి ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్నం రమాదేవి-లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ ముడిమడుగు శంకర్, వివిధ వార్డు సభ్యులు, నాయకులు,గోపాలమిత్ర సూపర్వైజర్ నరసయ్య,
పశువైద్య సిబ్బంది సంజయ్, కైలాస్, ఓఎస్ మురళి, గోపాలమిత్ర భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గారంలో పోచమ్మల జాతర

## కన్నుల పండుగగా రథోత్సవం




**బుగ్గారం, ఫిబ్రవరి02 (వుదయం ):**

మండల కేంద్రమైన బుగ్గారంలో సోమవారం శ్రీ ముత్యాల పోచ మ్మ,నల్ల పోచమ్మల జాతర అత్యంత వైభవంగా నిర్వహించా రు.ప్రధాన ఘట్టమైన రథోత్సవా న్ని భక్తజనం నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరావడంతో బుగ్గా రం జనసంద్రమైంది.ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలుఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య ఆధ్వర్యంలో జాతరకు భారీ ఏర్పాట్లు చేశారు.చైర్మన్ తన యుడు నరేష్ దంపతులు అమ్మవార్లకు నైవేద్యంగా బోనాలను సమర్పించారు. ఒగ్గు కళాకారులు,డప్పు కళాకారుల నృత్యాలు, దావతోళ్ల విన్యాసాలు భక్తులను మంత్ర ముగ్ధ లను చేశాయి. రంగురంగుల పిండితో వేసిన ముగ్గులు,పూలతో అలంకరిం చిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి.మొక్కులు తీర్చుకున్న భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, భక్తులు స్వయంగా రథాన్ని లాగి పునీతుల య్యారు. హమాలీ సంఘం,
ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో భక్తులకు రుచికరమైన అన్నదాన వితరణ చేశారు.ధర్మపురి సిఐరాం నరసింహా రెడ్డి పర్యవేక్షణలో,ఎస్సై సతీష్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ నక్క రాజవ్వ,ప్రజా ప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఆశ్చర్యకర మామిడి చెట్టు

## ఒకవైపు పూత మరోవైపు కాయలు



**సిద్దిపేట, ఫిబ్రవరి 02 (వుదయం ):**

సిద్దిపేట పట్టణంలో ఓ అరుదైన దృశ్యం కనుల విందుగా నిలుస్తోంది. ఉగాది పండుగకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, సిద్దిపేట పట్టణంలోని ఏడో వార్డులో ఉన్న ఓ ఇంట్లోని మామిడి చెట్టు చూసేవారిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.సాధారణంగా ఈ కాలంలో మామిడి చెట్లకు పూత మాత్రమే కనిపించాల్సి ఉండగా, ఈ చెట్టులో మాత్రం ఒకవైపు విరివిగా మామిడి పూత పూస్తుండగా, మరోవైపు ఇప్పటికే కొన్ని మామిడికాయలు కాయడం విశేషంగా మారింది.చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మామిడి పూత మాత్రమే దర్శనమిస్తుండగా, ఇంత తొందరగా ఒకే చెట్టుకు పూతతో పాటు కాయలు రావడం చాలా అరుదైన విషయమని స్థానికులు చెబుతున్నారు. ఈ అసాధారణ దృశ్యాన్ని చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు ఆసక్తిగా తరలివస్తున్నారు.వాతావరణ మార్పులు, అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగానే ఇలా జరిగి ఉండొచ్చని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, ఉగాది ముందే మామిడి కాయల సందడి ఆ ఇంటి పరిసరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలి

## అల్లాదుర్గం అసెంబ్లీ సాధన కమిటీ అధ్యక్షులు బ్రహ్మం




**ఆందోల్ ,ఫిబ్రవరి 2 (వుదయం )**

మెదక్ జిల్లా ను చార్మినార్ జోన్లో కలపాలని కోరుతూ మెదక్ జిల్లా అల్లాదుర్గంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అల్లాదుర్గం అసెంబ్లీ సాధన కమిటీ అధ్యక్షుడు కంచరి బ్రహ్మం ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి పలు గ్రామాల నాయకులతో వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సందర్భంగా మెదక్ జిల్లాను అన్యాయంగా దూర ప్రాంతంలో ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలిపిందని దీనివల్ల ఉద్యోగులకు, నిరుద్యోగులకు, తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.సబ్ డివిజన్ కేంద్రమైన అల్లాదుర్గం రాబోయే రోజుల్లో అసెంబ్లీ నియోజకవర్గం అవుతుందని, అందరికీ ఆమోదయోగ్యమైన చార్మినార్ జూన్లో కలిపితే నిరుద్యోగులకు,ఉద్యోగులకు, న్యాయం జరుగుతుందని తెలిపారు.ఉద్యోగ ఉపాధి, బదిలీల విషయంలో రాజన్న సిరిసిల్ల జోన్లో ఉండడంవల్ల సరైన న్యాయం జరగడం లేదని ప్రభుత్వం వెంటనే మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో విలీనం చేయాలని కోరారు.ఎన్నికల హామీలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రచార సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని , ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించి మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్,గణపతి ,భూమేష్, సంతోష్, శివకుమార్,
పాటు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి కావాల్సిందే..
- – అతి త్వరలో మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్ళ ప్రారంభం..
- – చెరువులు, కుంటలు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపండి..
- – రెండు ఎకరాల్లో స్లాటర్ హౌస్..
- – జిహెచ్ఎంసి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్

**సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు ఫిబ్రవరి 2 (వుదయం ):**

అమీన్పూర్, పటాన్చెరు బల్దియా సర్కిల్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు.సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పటాన్చెరు అమీన్పూర్ సర్కిల్ల పరిధిలోని డివిజన్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికలపై చర్చించారు. ప్రధానంగా మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇండోర్ స్టేడియం, అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని సూచించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న వార్డు కార్యాలయాన్ని ప్రత్యేకతను పూర్తి చేయాలన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలోగల వివేకానంద స్టేడియం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 27 కోట్ల రూపాయలు మంజూరు చేశాయని.. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో స్లాటర్ హౌస్ (పశువధశాల) నిర్మించబోతున్నట్లు తెలిపారు. 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో..ఆధునిక వసతులతో.. నూతన టెక్నాలజీతో నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములలో లేఔట్లు, అనుమతి లేని నిర్మాణాలు,
అక్రమంలో కొనసాగకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ .. కబ్జాదారుల పైన ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, పటాన్చెరు ఎమ్మార్వో హరిబాబు,రామచంద్రపురం తహసిల్దార్ సరస్వతి, విద్యుత్ శాఖ డిఈ భాస్కరరావు, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డి ఈ రామస్వామి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

## కంకరతో, గుంతలతో నరకయాతన ప్రయాణం




**సిద్దిపేట , ఫిబ్రవరి02 (వుదయం ):**

సిద్దిపేట రూరల్ బైపాస్ నుంచి చిన్న గుండె వెళ్లే ప్రధాన రహదారి కంకరతో, గుంతలతో నిండిపోయి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది.
గత మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రయాణం నరకయాతనగా మారింది. ఈ రహదారిపై ప్రతిరోజూ స్కూల్ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పెరిగింది. ముఖ్యంగా వర్షకాలంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతోంది. వాహనదారులు తగు జాగ్రత్తతో ప్రయాణం చేయాల్సి వస్తున్నా, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారి తీసే పరిస్థితి నెలకొంది.
ఈ మార్గంలో ప్రయాణించే స్కూల్ విద్యార్థులు,
వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతులు చేసి బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రహదారి అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎండైనా .. చలి అయినా చెట్లకిందే తరగతులు

## . ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు.. ఎల్లారెడ్డి మండలకేంద్రంలో ఘటన

**నిజాంసాగర్, 2(వుదయం ప్రతినిధి):**

ఎల్లారెడ్డి మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధ్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఓ వింత సమస్య వచ్చిపడింది. ఆ పాఠశాలకు తరగతి గదులు ఉన్నప్పటికి పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మయ్యసార్ తమను ప్రతీ రోజు ఆరుబయట చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారని, దీని వలన తాము ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. తరగతి గదులు ఉన్నప్పటికి తమకు ఎందుకీ బాధ అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉదయం చలి తీవ్ర ఎక్కువగా ఉంటున్న ద ష్ట్యా తమకు తరగతి గదిలోనే విద్యాబోధన కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



. చెట్ల కింద పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

## పారిశుధ్ధ్య కార్మికులు నాణ్యతతో

# కూడిన సేవలందించాలి

### బంజపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలించిన ఎంపీడీఓ




**నిజాంసాగర్, 2(వుదయం ):**

నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలలో పారిశుధ్ధ్య కార్మికులు గ్రామాల్లో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యతతో కూడిన సేవలందించాలని ఎంపీడీవో శివకృష్ణ అన్నారు. సోమవారం బంజపల్లి గ్రామపంచాయతీలో చేపడు తున్న పారిశుధ్ధ్య పనులను ఎంపీడీవో శివకృష్ణ పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురికి కాలువల శుభ్రపరిచే పనులు, చెత్త సేకరణ,

తడి--పొడి చెత్త వేరు చేసే విధానం, వీధుల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. పారిశుధ్ధ్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమన్వయం ఎంతో కీలకమని ఎంపీడీవో శివకృష్ణ తెలిపారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే స్వచ్ఛమైన గ్రామంగా అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అనీస్ పటేల్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి భీమ్‌రావు, కారోబార్ సాయిలు, పారిశుధ్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే సుమన్

### తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



**రామకృష్ణాపూర్/ ఫిబ్రవరి,2 (వుదయం)**

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మిత్రపక్షమైన సిపిఐ పార్టీ రామడుగు లక్ష్మణ్ ఇతర నాయకులతో కలిసిరామకృష్ణ పూర్ సి హెచ్ పి ఆలయం లో పూజలు నిర్వహించి ప్రచారం మొదలుపెట్టారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో సోమవారం రామకృష్ణాపూర్ బి జూన్, 3 వ వార్డు,17 వ వార్డు,18 వ వార్డు, 20 వార్డుల్లో ఓటర్లను కలిసి మేము సిపిఐ పార్టీ అను సంధానంతో రాబోయే మున్సిపల్ ఎలక్షన్లలో మా అభ్యర్థులు నిలబడుతున్నారని వారిని ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని వారు కోరారు. క్యాతన్ పల్లి రాజీవ్ చౌక్ లో పలు దుకాణా దారుల ను, పాన్ షాపుల వారిని కూడా తమ అమూల్యమైన ఓటును మాకు వేసి మా అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, కంభగోని సుదర్శన్ గౌడ్, బిఆర్ఎస్ క్యాతనపల్లి ఇన్చార్జి పల్లె భూమేష్, సిపిఐ పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్,
ఎండి అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, కాదండి సాంబయ్య, అలుగుల సత్తయ్య, మంద వేణుగోపాల్, వనం సత్యనారాయణ, కొండ కుమార్, ఆత్మకూరి మహేందర్, మల్లయ్య పోగుల, ఎల్లబెల్లి మూర్తి, మేడిపల్లి సంపత్, అనిల్ రావు, రామిడి కుమార్, బీఆర్ఎస్ అభిమానులు భారత కమ్యూనిస్టు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జెండా ఎగరాలి

### కోదాడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలి : ఎమ్మెల్యే పద్మావతి

**కోదాడ, ఫిబ్రవరి 2(వుదయం)**



కోదాడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలని, 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించేలా కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పిలుపునిచ్చారు.సోమవారం కోదాడ మున్సిపల్ పరిధిలోని 31వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యాలయాన్ని మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యెర్నేని వెంకట్ రత్నం బాబు మరియు స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయ ఢంకా మోగించాలి అని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, 31వ వార్డులో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి కుసుమ బాబును రికార్డు మెజారిటీతో గెలిపించాలన్నారు.పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసే ప్రతి నాయకుడు, కార్యకర్తను తప్పక గుర్తిస్తామని స్పష్టం చేశారు. పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగితే విజయం ఖాయమని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో కోదాడను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెడతామని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.ప్రత్యర్థుల ప్రలోభాలు, అసత్య ప్రచారాలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పరిపాలనా అనుభవం, కష్టపడే తత్వం ఉన్న కుసుమ బాబును గెలిపించి, కోదాడ మున్సిపాలిటీని మంత్రి ఉత్తమ్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ప్రతి ఓటు విలువైనదని, ఎన్నికల ప్రచారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఓటరును కలిసి ఓటు అభ్యర్థించాలని సూచించారు
.ఈ కార్యక్రమం యెర్నేని వెంకట్ రత్నం బాబు అధ్యక్షతన జరగగా, స్థానిక నాయకులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, వార్డు కార్యకర్తలు, పార్టీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తికి తక్షణమే స్వస్తి పలకాలి

### నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించిన బెల్లంపల్లి ఏసీపి రవికుమార్



**రామకృష్ణాపూర్/ ఫిబ్రవరి, 2 (వుదయం )**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పాత నేరస్తులకు, రౌడీ షీటర్లకు బెల్లంపల్లి ఏసీపి రవికుమార్ సోమవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలి, సమాజం గర్వించదగ్గ మనిషిలా బ్రతకాలి,నడవడికలో మార్పు రాకుంటే చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయి అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలకు, ఆందోళనలకు దిగన, పౌరులహక్కులకు, స్వేచ్ఛకు, భంగం కలిగించిన, సమాజం లో శాంతి-భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని, నేరప్రవృత్తిని మానుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్, ఎస్సైలు శ్రీధర్,నరేష్,
పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మంటగలిసిపోతున్న మానవీయ విలువలు

### సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కన్నకూతునే కడతేర్చిన తండ్రి

**నిజామాబాద్ ఫిబ్రవరి, 2 (వుదయం )**

: ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న మానవీయ విలువలు పూర్తిగా మంటగలిసిపోతున్నాయి. స్వార్థం కోసం మనుషులు ఎంతకైనా తెగిస్తున్నారు. స్వలాభం కోసం వివాహ బంధాలను, పేగు బంధాలను కూడా తృణప్రాయంగా వదిలేస్తున్నారు. నిలువెల్లా స్వార్థం నిండిన కొందరు మనుషులు కనిపెంచుకున్న తమ పిల్లలను కిరాతకంగా చంపడానికి కూడా ఏమాత్రం వెనుకాడటం లేదు.తాజాగా నిజామాబాద్ జిల్లాలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తాను సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కన్నకూతునే కడతేర్చాడు. వివరాల్లోకి వెళ్తే.. పాండురంగ అనే వ్యక్తి మహారాష్ట్రలోని కేరూరు సర్పంచ్‌గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే అక్కడి నిబంధనల ప్రకారం ముగ్గురు పిల్లలు ఉన్న వ్యక్తి సర్పంచ్‌గా పోటీ చేయడానికి అర్హత లేదు.కానీ పాండురంగకు మాత్రం ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎలాగైనా సర్పంచ్‌గా పోటీచేయాలని నిర్ణయించుకున్న అతడి మనసులో దుర్బుద్ధి పుట్టింది. తన పెద్ద కూతురును చంపేస్తే ఇంకా ఇద్దరు పిల్లలే ఉంటారు కాబట్టి పోటీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని.. కన్నబిడ్డ హత్యకు పథకం వేశాడు. పథకం ప్రకారం నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లికి పెద్దకు మార్తె ప్రాచీని తీసుకొచ్చాడు.కన్నతండ్రి వెంట తీసుకెళ్తున్నాడనే సంతోషంతో, తోడుగా ఉన్నాడనే ధైర్యంతో ఆ అమాయకురాలు అతడి వెంట వెళ్లింది.

## అభ్యంతరాల పరిష్కారంలో

# నిబంధనలు పాటించాలి

### -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల /ఫిబ్రవరి 2, (వుదయం)**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్లపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్లపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్లపై అందిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించి అర్హులైన అభ్యర్థుల జాబితా తయారు చేయాలని, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 క్రింద పట్టణంలో చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి, వచ్చే వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం చేపట్టిన మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేలాల జాతర దుకాణాల వేలం



**జైపూర్,జనవరి02 (వుదయం విలేకరి)**

వేలాల గట్టు మల్లన్న జాతర సందర్భంగా ఎంపిడిఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ.4 లక్షల వేలం ద్వారా వేలాల గ్రామానికి చెందిన జక్కం భాస్కర్ దక్కించుకున్నారు. పార్కింగ్, మరమరాలు (బోల్ పేలాలు) కొరకు నిర్వహించిన వేలంపాటలలో ప్రభుత్వ కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధరకు ఎవరు వేలం పాడక పోవడంతో వేలం పాటను ఈ నెల 4వ తేదికి వాయిదా వేసినట్లు గ్రామ సర్పంచ్ దేగ స్వప్న నగేష్ తెలిపారు. వేలాల గుట్టపై గల గట్టు మల్లన్న ఆలయంలో ప్రసాదం అమ్ము కునేందుకు,కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు ఈవో రమేష్ తెలిపారు.జైపూర్ మండలంలోని వేలాల గ్రామం గుట్టపై గల గట్టుమల్లన్న ఆలయ ఆవరణలో ప్రసాదం అమ్ముకునేందుకు రూ.2.10 లక్షలు,కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు .18 వేలు అలాగే గుట్ట కింద మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో ప్రసాదం అమ్ముకునేందుకు రూ.4.20 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.23 వేల బహిరంగ వేలంపాట ద్వారా పలువురు దక్కించుకున్నట్లు ఈవో రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఎస్సై రాజశేఖర్,ఉప సర్పంచ్ సుందిళ్ల రాయలింగు, పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు

### గ్రామంలో కోతుల బెడదను

# నిర్మూలించడమే లక్ష్యం

- కోతులను పట్టే కార్యక్రమం ప్రారంభం.
- గ్రామస్తుల సహాయ సహకారం విరాళాలతో కోతుల బెడద అరికట్టడం.

గ్రామ సర్పంచ్ దాసరి రమేష్.




**ఖానాపురం, ఫిబ్రవరి 2 (వుదయం ):**

గ్రామంలో కోతుల బెడదను లేకుండా నిర్మూలించడమే లక్ష్యంగా కోతుల నిర్మూలన కమిటీ పనిచేస్తుందని గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ గ్రామస్తులకు తెలిపారు. గ్రామంలో కోతులను పట్టి కోతులు లేకుండా నిర్మూలించే కార్యక్రమం సోమవారం నుంచి గ్రామంలో ప్రారంభమైనట్లు సర్పంచ్ గ్రామస్తులకు తెలుపుతూ, స్థానిక సంస్థల ఎన్నికల ముందు గ్రామంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దాతల సహాయ సహకారంతో గ్రామస్తుల సలహా సూచన మేరకు గ్రామంలోని మంచి పనులు చేపడతాని ఎన్నికల ముందు గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు దాతల విరాళాల సహకారంతో కోతులపట్టే కార్యక్రమంను చేపడుతున్నట్లు సర్పంచ్ తెలుపుతూ, కోతులను పట్టడానికి చెన్నె నుంచి చిరంజీవి టీం గ్రామానికి చేరుకొని కోతులను పట్టి కార్యక్రమంను గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేములపల్లి వెంకటప్రసాదరావు గుల్లపల్లి విజయ్, ఎండి అజహార్, గ్రామ కోతుల నిర్మూలన కమిటీ అధ్యక్షుడు డెంకల వెంకటేశ్వర్లు,
కమిటీ గౌరవ అధ్యక్షుడు పరుచూరి సుబ్బారావు, కమిటీ సభ్యులు గంగాపురం రాజు, మొయినుద్దీన్, జాకీర్ తదితరులు.

## గజ్వేల్ కేజీబీవీలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా: కలెక్టర్

**సిద్దిపేట, ఫిబ్రవరి 02 (వుదయం )**



గజ్వేల్ పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి వండిన అన్నం, పాలకూర పప్పు, వంకాయ-ఆలుగడ్డ-టమాటా కూరల నాణ్యతను పరీక్షించారు.పిల్లలకు వండే భోజనంలో నెయ్యిని తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తూ.. సరుకులు అందిన వెంటనే రికార్డులో నమోదు చేయాలని, "ఒకేసారి రాస్తాం" అనే నిర్లక్ష్య ధోరణి వహించకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ కామన్ డైట్ మెనూను పక్కాగా పాటించాలని, విద్యార్థుల హాజరుకు తగ్గట్టుగా రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. వడ్డించేటప్పుడు విద్యార్థులు కూర్చున్న చోటికే వెళ్లి అన్నం, కూరలు వడ్డించాలని స్పష్టం చేశారు.భోజన సమయంలో విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్, వారికి పలు సూచనలు చేశారు. "ఆహారాన్ని బాగా నమిలి తినాలి, తినేటప్పుడు మాట్లాడకూడదు. ఒక్క మెతుకు కూడా వృథా యకుండా తినాలి. సరిపడా ఆహారం తీసుకుంటేనే శారీరకంగా దృఢంగా ఉంటారు" అని తెలిపారు. చదువుతో పాటు ప్రతిరోజూ ఆటలు కూడా ఆడాలని పిల్లలను ప్రోత్సహించారు. పిల్లల కు అందించే భోజనం

, వసతి, మరియు చదువు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆమె సూచించారు.

# ఎన్నికలకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు





**రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని. మున్సిపల్ ఎన్నికల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్.**

**కరీంనగర్, ఫిబ్రవరి 02 (వుదయం ):**

మున్సిపల్ ఎన్నికలకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.మున్సిపల్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ పురపాలక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ లకు ఆదేశాలు జారీ చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరగాలన్నారు. పోలింగ్ కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు , డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్ పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం 2 లను సిద్ధం చేసి సంసిద్ధం కావాలని, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించాలన్నారు.
ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను ఎటువంటి

### పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి




**సత్తుపల్లి ,ఫిబ్రవరి 2 (వుదయం )**

సత్తుపల్లి సోమవారం జెవిఆర్ కళాశాలలో పిఒ, ఏపీఓలకు శిక్షణా తరగతుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కే నరసింహ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల విధులను సిబ్బంది పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

### 11వ వార్డులో

## కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం



**సత్తుపల్లి ,ఫిబ్రవరి 2 (వుదయం )**

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ నాగుల్ మీరా హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలంటూ ఇంటింటికి తిరిగి ప్రచారం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.
కార్యక్రమంలో నాగూర్ బి నాగమణి నసీమా మీరాభి అరుణ కరిముల్లా రాజా బాషు తదితరులు పాల్గొన్నారు.

### జనగణలో కులగణన చేర్చకపోతే ఢిల్లీ గద్దె దించుతాం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (వుదయం )**

;దేశవ్యాప్తంగా కులగనన చేపడతామని హామీ ఇచ్చి మాట తప్పితే దేశవ్యాప్తంగా అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ను తక్షణమే సవరించి ఓబీసీ కాలమ్ చేర్చాలి దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన పై ప్రస్తుత బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల లో ప్రత్యేక చర్చ పెట్టాలి బీసీ కులగన చేయకపోతే 27 మంది ఓబీసీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రస్తావనలే కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించి నిరసన తెలిపారు.

# వుదయం సినిమా

## సీసీఎల్ విజేతగా కర్ణాటక..

### రోహిత్ శర్మలా కిచ్చా సుదీప్..!



సెలబ్రిటీ క్రికెట్ లీగ్–2026 విజేతగా కర్ణాటక బుల్డోజర్స్ నిలిచింది. ఫైనల్లో బెంగాల్ టైగర్స్‌ను ఓడించిన కిచ్చా సుదీప్ సేన టైటిల్ ఎగరేసుకుపోయింది. ఇది కర్ణాటక బుల్డోజర్స్‌కు మూడో టైటిల్ కావడం విశేషం. దాదాపు 12 ఏళ్ల గ్యాప్ తర్వాత సీసీఎల్ కప్‌ను కర్ణాటక గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. కోయంబత్తూరులోని ఎస్ఎన్ఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ ఫైనల్ పోరు జరిగింది.

అయితే ఈ కప్ గెలిచాక కర్ణాటక బుల్డోజర్స్ సంబురాలు చేసుకుంది. మ్యాచ్ గెలిచిన కప్ అందుకునేందుకు వెళ్లిన కెప్టెన్ కిచ్చా సుదీప్ డిఫరెంట్ స్టైల్లో అలరించాడు. 2024లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా రోహిత్ శర్మ రోబో వాక్ స్టైల్లో వెళ్లి కప్ అందుకున్నారు. తాజాగా సీసీఎల్‌లోనూ అదే సీన్ రిపీట్ చేశాడు కిచ్చా సుదీప్. రోహిత్ శర్మ స్టైల్లోనే రోబో వాక్ చేస్తూ సీసీఎల్ ట్రోఫీని అందుకున్నాడు. ఈ వీడియో నెట్టింట కాస్తా వైరల్ కావడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. దీంతో అభిమానులు కిచ్చా సుదీప్ ట్రోఫీ వాక్ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఫైనల్‌లో కర్ణాటక బుల్డోజర్స్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో బెంగాల్ టైగర్స్‌ను 129 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన కర్ణాటక బుల్డోజర్స్ ఓపెనర్ రాజీవ్ హను కేవలం 35 బంతుల్లో 69 పరుగులు చేసి పరుగులు చేయడంతో సునాయాసంగా విజయం సాధించింది. ఇంకా మూడు ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. దీంతో కర్ణాటక టీమ్ ఫ్యాన్స్ సంబురాల్లో మునిగిపోయారు. ఈ సీజన్‌లో బెంగాల్ టైగర్స్ రన్నరప్‌గా నిలిచింది.

ఇక కిచ్చా సుదీప్ సినిమాల విషయానికొస్తే కన్నడ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్క్‌తో అలరించాడు. ఈ చిత్రం గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైంది. సుదీప్ ఇటీవల సినిమాల్లో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడు. ఇది మూడు దశాబ్దాల స్ఫూర్తిదాయకమైన ప్రయాణం అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు.

## అదంతా ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలే

**- బ్రహ్మానందం**



టాలీవుడ్ హాస్యనటుడు బ్రహ్మానందం తన 70వ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టాలీవుడ్ సినీ ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనదైన కామెడీతో సినీ ప్రియులను దశాబ్దాలుగా అలరించిన బ్రహ్మానందం 42 ఏళ్లుగా వెండితెరపై అలరిస్తున్నారు. తాజాగా తన 70వ బర్త్ డే వేడుకలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడారు.

ఇన్నేళ్లుగా తాను నటుడిగా కొనసాగుతున్నానంటే అదంతా ప్రేక్షకులు నా పట్ల చూపించిన ప్రేమాభిమానాలే కారణమని అన్నారు. నా సుదీర్ఘమైన సినీ ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు, ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఇవాళ ఈ స్థితిలో ఉన్నందుకు తెలుగు కళామతల్లికి శిరస్సు వంచి పాదాభినందనాలు చేస్తున్నానన్నారు. ఇన్ని సినిమాలు నిర్మించిన నిర్మాతలు, దర్శకులు గొప్పతనం వల్లే ఇది సాధ్యమైందన్నారు. నాకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని బ్రహ్మానందం తెలిపారు.

నేను ఈ ఫిల్మ్ ఇండస్ట్రీకి రావడానికి కీర్తిశేషులు జంధ్యాల, చిరంజీవి, రామానాయుడే కారణమని బ్రహ్మానందం అన్నారు. నాలో టాలెంట్ ను గుర్తించి చంటబ్బాయి సినిమాలో నన్ను చిరంజీవి పరిచయం చేశారు. ఆ తర్వాత జంధ్యాల నాకు అహా నా పెళ్లంట మూవీలో అవకాశమిచ్చారని తెలిపారు. ఇన్ని వందల సినిమాలు చేయడంలో నా గొప్పతనం ఏమీ లేదన్నారు. మీ అందరి ఆదరణ, ప్రేమ వల్లే ఈ బ్రహ్మానందం ఇక్కడ ఉన్నారని అన్నారు.

## కూతురు పుడితే బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ.. పెద్ది సినిమా కూడా!

ఆడపిల్ల పుట్టాలంటే అదృష్టం ఉండాలంటారు. కానీ, ఆ పాప పుడుతూనే అదృష్టాన్ని మోసుకొస్తుందని ఎవరూ ఊహించి ఉండరు.. అదెలాగంటే స్టార్ హీరోలకు పాప పుట్టాక దశ తిరిగిపోయింది. హిట్లు, సూపర్ హిట్లు కాదు ఏకంగా ఇండస్ట్రీ హిట్లు కొట్టారు. కెరీర్‌లోనే హయ్యస్ట్ కలెక్షన్స్ చూశారు. ఆ సంగతులు ఓసారి చూసేద్దాం..

**పాప తెచ్చిన సంతోషం..**

బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ 2023లో 'యానిమల్' మూవీతో సాలిడ్ హిట్ కొట్టాడు. ఈ సినిమా ఏకంగా రూ.917 కోట్లు రాబట్టింది. రణ్‌బీర్ కెరీర్‌లోనే ఇది అత్యధికం. అయితే ఈ సినిమా కంటే ముందు అతడి జీవితంలో ఓ అద్భుతం జరిగింది. 2022లో రణ్‌బీర్–ఆలియా భట్ పెళ్లి చేసుకున్నారు. వీరికి అదే ఏడాది నవంబర్‌లో కూతురు రాహా పుట్టింది. పాప పుట్టిన వేళా విశేషం.. రణ్‌బీర్‌కు బాగా కలిసొచ్చింది. సందీప్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన యానిమల్ సినిమాతో రికార్డులు తిరగరాశాడు. ఈ మూవీకి సీక్వెల్‌గా యానిమల్ పార్క్ రాబోతోంది.

**అదృష్టం..**

బాలీవుడ్‌లో మరో స్టార్ జోడీ రణ్‌వీర్ సింగ్ – దీపికా పదుకొణె. వీరిద్దరూ 2018లో వివాహం చేసుకున్నారు. పెళ్లయిన ఆరేళ్లకు అంటే 2024 నవంబర్‌లో ఈ దంపతులకు కూతురు పుట్టింది. ఎన్నో ప్రార్థనల ఫలితంగా జన్మించడంతో తనకు దువా అని నామకరణం చేశారు. పాప పుట్టాక రణ్‌వీర్ కెరీర్‌కు కూడా మంచి బూస్ట్ లభించింది. 2025 చివర్లో వచ్చిన ధురంధర్ సినిమా రూ.1200 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమాకు కూడా సీక్వెల్ వస్తోంది. ఈ ఏప్రిల్ 17న ధురంధర్ 2 విడుదల కానుంది.



**పెద్ది కూడా బ్లాక్‌బస్టర్!**

టాలీవుడ్ స్టార్ కపుల్ రామ్‌చరణ్–ఉపాసన పెళ్లయిన పదేళ్లకు పేరెంట్స్‌గా ప్రమోషన్ పొందారు. ఉపాసన కడుపుతో ఉండగానే చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ట్రిపుల్ ఆర్ మూవీలోని నాటు నాటు పాట ఆస్కార్ అవార్డు సొంతం చేసుకుని తెలుగు సినిమాను ప్రపంచ స్థాయిలో సగర్వంగా నిలబెట్టింది. ఈసారి చరణ్‌కు కవలలు (పాప, బాబు) పుట్టారు. చరణ్ నెక్స్ట్ మూవీ పెద్ది. ఆడపిల్ల పుట్టిన ప్రతిసారి హీరోలు ఊహించలేనంత విజయాల్ని అందుకుంటున్నారు. ఈ లెక్కన చరణ్‌కు మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ రావడం పక్కా అని అభిమానులు భావిస్తున్నారు.



## ఇక్కడ సింగీతం.. అక్కడ గోపాలకృష్ణన్

### వయసు పైబడినా.. స్ఫూర్తినింపే 'డైరెక్షన్'..

94 ఏళ్ల వయసులో దర్శకుడిగా ఓ సినిమాని ప్రకటించి, అందరినీ ఆశ్చర్యపరిచారు సింగీతం శ్రీనివాసరావు. వెండితెరపై ఎన్నో అద్భుతాలు సృష్టించిన ఆయన కొత్త చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరో సీనియర్ డైరెక్టర్ కూడా కొంత విరామం అనంతరం ఇటీవల ఓ చిత్రాన్ని ప్రారంభించారు. ఆయన వయసు 84 ఏళ్లు. ఇండస్ట్రీలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే ఈ ఇద్దరి దర్శకుల కొత్త ప్రయాణం, గత వైభవం వివరాలివీ..

టాకీ యుగంలో మాటల్లేని సినిమా (పుష్పక విమానం) చేయడం, టెక్నాలజీలేని రోజుల్లో 'ఆదిత్య 369'లాంటి టైమ్ ట్రావెల్ చిత్రం రూపొందించడం సింగీతానికే చెల్లింది. బయోపిక్ 'మయూరి', జానపదం 'భైరవద్వీపం', కమల్‌హాసన్‌ను పొట్టిగా చూపించిన 'విచిత్ర సోదరులు' తదితర చిత్రాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచాయి. 'వెల్‌కమ్ ఒబామా'తో తరువాత డైరెక్షన్‌కు బ్రేక్ ఇచ్చిన సింగీతం.. మళ్లీ ఇన్నాళ్లకు మెగాఫోన్ పట్టారు. ఇది ఆయనకు 61వ చిత్రం. నటీనటుల వివరాలను ఇంకా ప్రకటించలేదుగానీ సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ ఎంపిక కావడం విశేషం. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నిర్మిస్తోంది.

**హిట్ కాంబినేషన్..**

మమ్ముట్టి హీరోగా అడూర్ గోపాలకృష్ణన్ 'పాదయాత్ర' సినిమా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల వెలువడిన ఈ ప్రకటనతో మలయాళ చిత్ర పరిశ్రమలో ఆసక్తికర చర్చ సాగింది. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు విజయం కావడంతోపాటు అవార్డులూ దక్కించుకోవడం అందుకు కారణం. ఈ కాంబోలో రూపొందిన 'మథిలుకళ్'కు నాలుగు విభాగాల్లో, 'విధేయన్'కు రెండు కేటగిరీల్లో జాతీయ పురస్కారాలు దక్కాయి. వీటి కన్నా ముందు వీరిద్దరు 'అనంతరం' మూవీకి కలిసి పని చేశారు. 2016లో వచ్చిన 'పిన్నెయమ్' తర్వాత గోపాలకృష్ణన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'పాదయాత్ర'నే.

మలయాళ చిత్ర పరిశ్రమలో కొత్త ఒరవడి తీసుకొచ్చిన దర్శకుడాయన. 'స్వయంవరం'తో 1972లో డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించారు. కుటుంబాలను కాదనుకుని, ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట ఎలాంటి సమస్యలు ఎదుర్కొందనే కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాతో గోపాలకృష్ణన్ పేరు మార్మోగింది. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో ఆయన తెరకెక్కించినవి 12 సినిమాలే అయినా దేనికదే ప్రత్యేకం. 'కొడియెట్టం', 'ముఖముఖం'.. ఇలా వాస్తవానికి దగ్గరగా ఉండే కథలను తెరకెక్కించారు కాబట్టే అన్నింటికీ నేషనల్ అవార్డులు (ఒక్క సినిమా మినహా) వచ్చాయి. కొన్ని సినిమాలు పలు విభాగాల్లో జాతీయ పురస్కారాలు గెలుచుకోవడం ఒకెత్తైతే.. కొన్ని చిత్రాలు అంతర్జాతీయ సినీ వేడుకల్లో ప్రదర్శితం కావడం మరో ఎత్తు. ఫీచర్ ఫిల్మ్స్ చేస్తూనే గోపాలకృష్ణన్.. డాక్యుమెంటరీలు రూపొందించారంటే వాటిపై ఆయనకు ఎంత ఆసక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.

## మరోసారి.. ధనుష్ - సాయి పల్లవి జోడీ..



ధనుష్ – సాయి పల్లవి జోడీ మరోసారి తెరపై సందడి చేయనుంది. 2018లో వచ్చిన 'మారి 2'లో మెరిసిన ఈ జంట.. ఇప్పుడు మరో సినిమాలో నటిస్తోంది. 'అమరన్'తో సత్తా చాటిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి.. ధనుష్ హీరోగా ఇటీవల ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ధనుష్‌కు ఇది 55వ చిత్రం. 'డీ 55' (D55) వర్కింగ్ టైటిల్‌గా ఉన్న ఈ సినిమాలో ఇప్పటికే హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక కాగా.. మరో కథానాయికగా సాయి పల్లవి ఎంపికయ్యారు. ఆ విషయాన్ని తాజాగా వెల్లడించారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. వాస్తవ సంఘటనల ఆధారంగానే దీన్ని రూపొందిస్తున్నారని, ఇందులో ధనుష్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారని తెలిసింది.

'అమరన్'లోనూ సాయి పల్లవే హీరోయిన్. అటు హీరో, ఇటు దర్శకుడితో సాయి పల్లవికి 'డీ 55' రెండో సినిమా కావడం విశేషం. 'మారి 2'లోని సాంగ్‌లో ధనుష్– సాయి పల్లవి చేసిన డ్యాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! తెలుగు, తమిళం, మలయాళంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి 'ఏక్ దిన్'తో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరో. మరోవైపు, భారీ బడ్జెట్ మూవీ 'రామాయణ'లో సాయి పల్లవి.. సీత పాత్ర పోషిస్తున్నారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.



## నేను యాక్టింగ్ చేయడం అతనికి నచ్చలేదు

**– సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్**

సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. సినిమాల కంటే పర్సనల్ లైఫ్‌పై రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. కోలీవుడ్ స్టార్ ధనుశ్‌ను ఆమె పెళ్లాడనుందని వార్తలొచ్చాయి. వీటిపై తాజాగా ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. ధనుశ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే కాదు.. ఒక అన్నలాంటి వాడని చెప్పుకొచ్చింది. ఆమె నటించిన దో దివానే శహర్ మే అనే మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న మృణాల్ ఠాకూర్ ఈ విషయంపై స్పందించింది. అంతేకాకుండా తన బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ గురించి మృణాల్ చెప్పేసింది. నేను యాక్టింగ్ చేయడం అతనికి నచ్చలేదని.. మేము విడిపోవడానికి అదే కారణమని తెలిపింది. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని అతనే బ్రేకప్ చెప్పేశాడని వెల్లడించింది. ఈ విషయంలో తనకు ఎలాంటి బాధ లేదని.. అలాంటి వాడితో కొనసాగడం కష్టంగా అనిపించిందని పేర్కొంది. అందుకే అతనితో విడిపోవాల్సి వచ్చిందని మృణాల్ చెప్పుకొచ్చింది. బ్రేకప్ తర్వాత అతని గురించి జాలిపడ్డానని తెలిపింది.

కాగా.. మృణాల్ హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం దో దివానే శహర్ మే. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అంతేకాకుండా టాలీవుడ్ హీరో అడివి శేష్ సరసన డకాయిట్‌లో మృణాల్ నటిస్తోంది. ఈ సినిమా మార్చి 19న రిలీజ్ కానుంది.




## 'డియర్ ఆస్ట్రోనాట్'..

### ఆసక్తిగా మూవీ గ్లింప్స్

వితికా షేరు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. కార్తిక్ భాగ్యరాజా దర్శకత్వం వహిస్తున్నారు. వితికా పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ వీడియోలో.. వ్యోమగామిగా వితిక కనిపించారు. విజువల్స్, నేపథ్య సంగీతం ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రంలో వితిక భర్త, నటుడు వరుణ్ సందేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## అక్కా.. నిన్ను ఇప్పటికైనా అర్థం చేసుకున్నా: చెల్లి ఎమోషనల్ పోస్ట్



టాలీవుడ్ హీరో వరుణ్ సందేశ్ సతీమణి వితికా శేరు గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. 'పడ్డానండి ప్రేమలో మరి' అనే చిత్రంలో మొదలైన వీరిద్దరి జర్నీ పెళ్లి పీటలవరకు తీసుకెళ్లింది. ఈ సినిమాతోనే ప్రేమలో పడిన ఈ జంట కుటుంబాల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత వీళ్లిద్దరూ కలిసి బిగ్‌బాగ్ 3వ సీజన్ లో పాల్గొని మరింత గుర్తింపు తెచ్చుకున్నారు.

అయితే గతేడాది వరుణ్ సందేశ్ బర్త్ డే కానుకగా ఏకంగా సొంతింటినే గిఫ్ట్‌గా ఇచ్చింది వితికా శేరు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. అంతేకాకుండా 2025 నవంబర్‌లో తన చెల్లి సీమంతం వేడుకను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంది. తన చెల్లి సీమంతాన్ని తానే దగ్గరుండి మరీ నడిపించింది. అక్కగా అన్నీ తానై చెల్లి క్రితిక శేరు సీమంతాన్ని జీవితాంతం గుర్తుండిపోయేలా చేసింది. తాజాగా ఇవాళ తన అక్క వితికా శేరు బర్త్ డే కావడంతో చెల్లి క్రితిక శేరు విషెస్ తెలిపింది. తన కోసం అక్క చేసిన క్షణాలను గుర్తు చేసుకుంది. తన వెంట ఉంటూ అండగా నిలిచిన అక్కకు మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. చాలా కాలంగా నేను నిన్ను నిజంగా అర్థం చేసుకోలేదంటూ ఎమోషనల్ పోస్ట్ చేసింది. నువ్వు ఎప్పుడు



బిజీగా ఉన్నా.. బాధ్యతలను మోస్తూ.. మన కుటుంబాన్ని చూసుకోవడానికి నీ కెరీర్‌ను నిర్మించుకుంటూనే ఉన్నావంటూ రాసుకొచ్చింది. నా చిన్నప్పుడు ఇతరుల్లో ఉన్నంత అనుబంధం మనలో లేదని నాకు అనిపించింది.. కారణాలు తెలియకుండానే నిన్ను చాలాసార్లు ప్రశ్నించానంటూ భావోద్వేగానికి గురైంది క్రితిక శేరు.

క్రితిక శేరు తన ఇన్‌స్టాలో రాస్తూ..' నా పెళ్లి తర్వాత.. ముఖ్యంగా ఈ గర్భధారణ సమయంలో ప్రతిదీ మారిపోయింది. దూరం వల్ల నీ ప్రేమ నాకు చాలా స్పష్టంగా కనిపించింది. నువ్వు చిన్న చిన్న విషయాలను గమనించావు. నన్ను భావోద్వేగంగా.. మానసికంగా ఆదుకున్నావు. ఈ ప్రయాణాన్ని నాకు చాలా సులభతరం చేసి మరింత అందంగా మార్చావ్. నేను ఇంతకు ముందు ఎప్పుడూ చూడని విధంగా నా కోసం నువ్వు నిలబడ్డావ్. చివరికీ ఈరోజు నేను నిన్ను అర్థం చేసుకున్నా అక్కా. నీ ప్రేమ నాపై ఎల్లప్పుడూ బలంగా ఉంది. నువ్వు నా కోసం చేసిన ప్రతి చిన్న పనికి ధన్యవాదాలు. ఈ రోజు నా బలం, నా మద్దతు.. నాకు అతిపెద్ద ఆశీర్వాదం నువ్వే అక్కా. నీకు మనస్ఫూర్తిగా పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ పోస్ట్ చేసింది. ఇది తెలుసుకున్న అభిమానులు వితికా శేరుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.